ప్రజాశక్తి
గురువారం 7 ఆగస్టు 2025 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

డోలాయనంలో పల్నాడు రైతులు

- పొగాకు సాగు చేయొద్దని అధికారుల ఆదేశం
- రబీలో వరికి నీరు ఇవ్వలేమని ప్రకటన
- పెట్టుబడి పెరిగి ధరలేక మిర్చి సాగుకు విముఖత
- పత్తి సాగు చేసినా రూ.10 వేలు మిగలని దుస్థితి
- గత సీజన్‌లో అపరాల ధరలు భారీగా తగ్గుదల

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

పల్నాడు జిల్లా రైతులు డోలాయనంలో చిక్కుకున్నారు. కొంత ఆలస్యమైనా వర్షాలు ఆశాజనకంగా ఉన్నాయి. సాగర్ జలాశయం పూర్తిగా నిండి కాల్వలకు నీరు వస్తోంది. అయినా ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు రైతులు తటపటాయిస్తున్నారు. పులి మీద పుట్రలాగా ఫలానా పంట వేయద్దు.. మేం అనుమతి ఇవ్వలేమని అధికారులు సమీక్షల్లో చెబుతున్నారు. బుధవారం పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఈ ఏడాది పల్నాడు జిల్లాలో పొగాకు సాగుకు అనుమతి లేదని చెప్పారు. వచ్చే రబీలో వరికి నీరివ్వలేమని ముందే ప్రకటించారు. తొలి పంటగా అపరాలు, మొక్కజొన్న, జొన్న సాగు చేసిన రైతులు రెండో పంటగా వరి సాగు చేద్దామని ఆలోచనలో ఉన్నారు. వీరికి బ్రేకులు వేస్తూ రబీలో వరి సాగు చేయవద్దని కలెక్టర్ ప్రకటించారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు రైతులకు సమాయత్తం చేసేందుకు నిర్వహించిన సమీక్షల్లో జిల్లావ్యాప్తంగా వర్షపాతం నమోదు, సాధారణ పంట సాగు విస్తీర్ణం, ప్రత్యామ్నాయ పంటల సాగు, ఎరువుల లభ్యత, కౌలుదారు హక్కు పత్రాలు, కౌలు రైతులకు పంట రుణాల పంపిణీ మొదలైన కార్యక్రమాలపై వ్యవసాయ అధికారులతో సమీక్షించారు. ఈ ఖరీఫ్ సీజన్లో పొగాకు పంట సాగుని పూర్తిగా నిషేధించాలని, రబీ కాలానికి వరి పంట సాగుకి సాగర్ నీరు విడుదల చేయడం సాధ్య పడదని, రైతులకి వ్యవసాయ అధికారులు, గ్రామస్థాయిలో వ్యవసాయ అధికారులు తెలియజేయాలని కలెక్టరు ఆదేశించారు. జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు మండల వ్యవసాయ అధికారులు రైతులకి తగిన సూచనలు సలహాలు అందజేస్తూ, ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మొగ్గు చూపేలా శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

గత సీజన్‌లో పొగాకు విస్తీర్ణం బాగా పెరగడంతో పాటు వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలను తగ్గించడంతో రైతులు నష్టపోయారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలస్యంగా మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసినా రైతులకు పూర్తిస్థాయిలో మేలు జరగలేదు. అయితే ఇతర పంటల కంటే కొంత మంది రైతులు పొగాకు మేలనే భావనలో ఉన్నారు. వర్జీనియా పొగాకు బోర్డు అనుమతిస్తుంది. నల్లబర్లీకి నియంత్రణ లేదు. గతేడాది సాగు ▶ 2లో

గేట్లు మూసివేసి ఉన్న సాగర్ జలాశయం

జలాశయాలకు తగ్గిన ప్రవాహం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి/విజయపురిసౌత్

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రధాన జలాశయాలకు ఎగువ నుంచి వరద ప్రవాహం తగ్గింది. శ్రీశైలం నుంచి వరద ప్రవాహం తగ్గడంతో నాగార్జున సాగర్‌కు వస్తున్న ప్రవాహం తగ్గింది. ఎగువ నుంచి సాగర్‌కు 66,131 క్యూసెక్కుల నీరు సాగర్ జలాశయానికి వచ్చి చేరుతోంది. సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టిఎంసిలు కాగా ప్రస్తుతం 306 టిఎంసిలుగా ఉంది. సాగర్ నుంచి 44,108 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతల గరిష్ట నీటి నిల్వ 45.77 టిఎంసిలుకాగా ప్రస్తుతం 42.82 టిఎంసిల నిల్వ ఉంది. పులిచింతలకు ఎగువ నుంచి 30,489 క్యూసెక్కుల నీరు వస్తుండగా 45,104 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజి వద్ద గరిష్ట నీటి నిల్వ 3.07 టిఎంసిలు కాగా పూర్తి స్థాయిలో నీల్వలు ఉండటంతో ఎగువనుంచి వస్తున్న 40,005 క్యూసెక్కుల నీరు వస్తుండగా వచ్చిన నీటిని వచ్చినట్టు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. అటు సాగర్ కాల్వలకు గరిష్టంగా 15 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఇటు డెల్టాలో ప్రకాశం బ్యారేజి నుంచి కాల్వలకు గరిష్టంగా 8 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.

బతికున్నా... చనిపోయినట్లు పత్రాలు!

తప్పుడు డాక్యుమెంట్లతో బంధువుల ఆస్తి అమ్ముకున్న కేసులో మేనల్లుడు సహా నలుగురు అరెస్టు

ప్రజాశక్తి - తెనాలిరూరల్

బతికున్న మేనత్తని మృతి చెందినట్లుగా సృష్టించాడో ఓ ప్రబుద్ధుడు. మేనత్త ఆస్తిని విక్రయించే క్రమంలో భూహక్కుదారులు బసవ పూర్ణకుమారి రంగప్రవేశం చేయడంతో అసలు కథ బయటపడింది. ఈ మేరకు వివరాలను డిఎస్‌పి బి.జగన్నాథరావు బుధవారం వెల్లడించారు.తెనాలి మండలం బుర్రిపాలెం గ్రామానికి చెందిన గాజుల బసవ పూర్ణకుమారి కొంతకాలంగా హైదరాబాద్‌లోని బంధువుల వద్ద ఉంటున్నారు. ఆమెకు చెందిన రెండెకరాల మాగాణి, 17 సెంట్ల ఇంటి స్థలాన్ని కాజేయడానికి మేనల్లుడు గొల్లపల్లి నరేష్, తండ్రి సత్యనారాయణతో కలిసి పథకం పన్నాడు. పూర్ణకుమారి 2020లో మృతిచెందినట్లు, అంతకుముందే తన భర్త సత్యనారాయణ కూడా మరణించినట్లు మరణ ధ్రువపత్రాలను సృష్టించాడు. తెనాలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా డాక్యుమెంట్ రైటరుగా పనిచేస్తున్న తిరుపతి మరియదాస్, తెనాలి మున్సిపల్ కాంప్లెక్స్‌లో మీ-సేవ కేంద్రం నిర్వహిస్తున్న దాసరి శివన్నారాయణతో కలిసి దొంగపత్రాలు సృష్టించి, సదరు హక్కు విడుదల దస్తావేజులు ద్వారా రిజిస్ట్రేషన్ సృష్టించిన పూర్ణ కుమారికి

వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి, ఇతర పోలీసులు వెనుక ముసుగుల్లో నిందితులు

చెందిన ఆస్తిని నరేష్ రూ.55 లక్షలకు అమ్ముకున్నాడు. ఆమెకు ▶ 2లో

ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్ తదితరులు

నేడు మంగళగిరిలో సిఎం చంద్రబాబు పర్యటన

ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక ఆటోనగర్‌లోని వీవర్‌శాల వద్ద గురువారం జరిగే జాతీయ చేనేత దినోత్సవంలో సిఎం చంద్రబాబు పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లను గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి బుధవారం పరిశీలించారు. సిఎం ప్రయాణించే మార్గాలు, వివర్ శాల సందర్శన, చేనేత కుటుంబాలతో సమావేశమయ్యే ప్రజా వేదిక వద్ద చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. పరిశీలనలో ఎస్పీ సతీష్ కుమార్, జెసి ఎ.భార్గవ్‌తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, ఎమ్‌టిఎంసి కమిషనర్ అలీంబాషా, హ్యాండ్ లూమ్స్ అండ్ టెక్స్టైల్ జెడి రాజారావు, తహశీల్ధార్ దినేష్ రాఘవేంద్ర పాల్గొన్నారు.

నలుగురు జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - తెనాలి

జూదరులతో సీఐ రమేష్ బాబు

స్థానిక చంద్రబాబు నాయుడు కాలనీలో ఓ ఇంట్లో పేకాడుతున్న సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం రాత్రి దాడి చేశారు. పేకాడుతున్న నలుగురు జూదరులను అదుపులోకి తీసుకుని, వారిపై కేసు నమోదు చేసి, వారి నుంచి రూ.3 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ త్రి టౌన్ సిఐ ఎస్ రమేష్ బాబు వెల్లడించారు. దాడులలో ఆయనతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్

పి-4 కార్యక్రమంపై అవగాహన

ప్రజాశక్తి తెనాలి

ప్రభుత్వం ఈనెల 15న ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న పి4 సర్వేపై పురపాలక సంఘంలోని మెప్మా షెడ్ లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కమిషనర్ వి లక్ష్మీపతి రావు మాట్లాడుతూ సబ్ కలెక్టర్ సంజన సింహ ఆదేశాల మేరకు పి4 సర్వేపై వార్డు ప్లానింగ్, వెల్ఫేర్ సెక్రటరీలకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. బంగారు కుటుంబాలను గుర్తించి వారికి పి4 కార్యక్రమం ద్వారా లబ్ది చేకూర్చే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ తుమ్మల శివన్నారాయణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్మశాన వాటికలో మౌలిక సదుపాయాలకు శంకుస్థాపన చేస్తున్న టిడిపి నాయకులు

చిర్రావూరులో హిందూ, ముస్లిమ్ శ్మశాన వాటికల మౌలిక సదుపాయాలకు శంకుస్థాపన

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో ఎంటిఎంసీ పరిధిలోని చిర్రావూరు గ్రామంలో రూ.65 లక్షల నిధులతో హిందూ ముస్లిం స్మశాన వాటికల మౌలిక సదుపాయాలకు టిడిపి నాయకులు శంకుస్థాపన చేశారు. హిందూ స్మశానానికి రూ.35 లక్షలు, ముస్లిం స్మశాన వాటికకు రూ.25 లక్షల రూపాయల తో అంతిమ సంస్కారాల షెడ్డు, లాకర్, వాహనాల షెడ్డు, గ్రీనరీ, రోడ్లు, లైటింగ్, మరుగుదొడ్లు, వాటర్ ట్యాంక్ తదితర సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టారు. స్మశాన వాటికలను అభివృద్ధి చేయడానికి ముందుకు వచ్చిన మంత్రి నారా లోకేష్‌కు చిర్రావూరు గ్రామస్తులు, నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి తాడేపల్లి మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ సహకారంతో రోడ్లు, వాటర్ ప్లాంట్స్ ప్రభుత్వ పథకాలు అన్ని గ్రామాలలో అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. మంగళగిరి నియోజకవర్గం పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు లోకేష్ కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం తాడేపల్లి మండల అధ్యక్షులు దాసరి కఅష్ణ, టిడిపి తాడేపల్లి మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, టిడిపి గ్రామ అధ్యక్షులు కాసర్గడ్డ శ్రీనివాసరావు, పార్టీ ప్రధాన కార్యదర్శి కొంకా ప్రభాకరరావు, జనసేన గ్రామ అధ్యక్షులు అంకం ఖాళీ కఅష్ణ, నాయకులు లాల్చంద్, దావులూరి అనిల్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బతికున్నా... చనిపోయినట్లు పత్రాలు!

(మొదటి పేజీ తరువాయి)

చెందిన 17 సెంట్ల ఇంటి స్థలాన్ని మూడు భాగాలుగా చేసి హైదరాబాద్, దుగ్గిరాల, తెనాలి పట్టణ ప్రాంతాలకు చెందిన వారికి అమ్మాడు. అయితే దీనిపై సమాచారం తెలిసిన బసవ పూర్ణకుమారి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో స్థల పత్రాలను పరిశీలించుకోగా అసలు విషయం బయటపడడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నలుగురు నిందితులను బుధవారం ఓ ప్రైవేటు కళాశాల సమీపంలో బుధవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. ఇదిలా ఉండగా నరేష్ తన తల్లి ఓటు కార్డులో పిన్ని పేరును పొందుపరిచి ఆమెకున్న 3.5 ఎకరాల ఆస్తిని మరియదాసుతో కలసి ఇతరులకు విక్రయించినట్లు అమృతలూరు పోలీస్‌స్టేషన్‌లోనూ గతంలో కేసు నమోదైంది. ఇదే తరహా మోసాలతో మంగళగిరి, రేపల్లెలో కూడా కేసులున్నాయని డిఎస్‌పి తెలిపారు. నిందితుల నుంచి లాప్‌టాప్, కలర్ ప్రింటర్ స్వాధీన పరచుకున్నారు. కార్యక్రమంలో సిఐ ఆర్.ఉమేష్, ఎస్‌ఐ కె.ఆనంద్ పాల్గొన్నారు.

డోలాయనంలో పల్నాడు రైతులు

(మొదటి పేజీ తరువాయి)

సమయంలో రైతులతో కంపెనీలు ఒప్పందాలు చేసుకుని ఆ తరువాత ఉల్లంఘించాయి. దీంతో రైతులు నష్టపోయారు. అయితే పొగాకు సాగు విస్తీర్ణం తగ్గించాలని చెప్పాల్సిన అధికారులు పూర్తిగా సాగు చేయవద్దని చెప్పడం వల్ల ప్రత్యామ్నాయంగా ఏ పంట సాగు చేసినా గిట్టుబాటు కానీ పరిస్థితుల్లో రైతులు తీవ్ర అయోమయంలో చిక్కుకుంటున్నారు. గతేడాది మిర్చి సాగు వల్ల భారీగా పెట్టుబడి పెరిగి ధరలు లేక రైతులు తీవ్ర ఇబ్బందుల్లో చిక్కుకున్నారు. ఎకరాకు సగటున రూ.లక్ష వరకు నష్టపోయారు. పత్తి సాగు చేసిన రైతులకు కూడా పంట చేతికి వచ్చిన సమయంలో సిసిఐ కొనుగోలు చేయలేదు. మార్గదర్శకాల పేరుతో ఆంక్షలు పెట్టారు. దళారీలు ధర తగ్గించారు. పత్తి సాగు చేసిన వారికి ఎకరాకు రూ.10 వేలు కూడా మిగలని పరిస్థితిలో చాలా మంది ఇబ్బంది పడ్డారు. వరి సాగులో కూడా ఆదిలో ధరలు తగ్గించడం, నిల్వ చేసుకునే అవకాశం లేక కనీస మద్దతు ధర కంటే తక్కువకు విక్రయించుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. తేమ శాతం పేరుతో రైతులను అధికారులు ఇబ్బంది పెడుతున్నారు. ఇలా పంట సాగు చేసినా ధర లేక 2024-25 సీజన్‌లో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ పరిస్థితుల్లో రైతులకు మెరుగైన ప్రత్యామ్నాయం చూపాల్సిన యంత్రాంగం పంట సాగుపై ఆంక్షలు విధించడం వల్ల మొత్తంగా సాగు విస్తీర్ణమే తగ్గిపోయే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే ఈ ఏడాది ఖరీఫ్ సాగులో మందగమనం కొనసాగుతోంది.

మంగళగిరిలో మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి - మంగళగిరి

మెగా జాబ్ మేళాకు హాజరైన యువతి యువకులు

మంగళగిరి పట్టణంలో ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ మేళాలో నిరుద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని ఉద్యోగాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరుద్యోగులు హాజరవ్వగా ప్రతిభ, అవగాహన సామర్థ్యం ఆధారంగా 508 మందికి ఉద్యోగాలు లభించాయి. నిరుద్యోగ యువతి, యువకుల కోసం డాటా ఎంట్రీ, బి.పి.ఓ, రిటైల్, ఈ కామర్స్, ఆటోమోటివ్, వైద్య ఫార్మసీ, ఎలక్ట్రికల్, బ్యాంకింగ్, హీరో మోటర్స్, మాస్టర్ మైండ్స్, శ్రీరాం ఫైనాన్స్, ఇన్సూరెన్స్, మెడ్ ప్లస్, సాఫ్ట్ వేర్, ముత్తూట్ ఫైనాన్స్ రంగాలలో ఉద్యోగ అవకాశాల కల్పనకై మెగా జాబ్ మేళాను వీటిజేఎం, ఐవిటిఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించారు. ఏడో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివిన వారు, ఇంటర్, డిప్లమా, బి-ఫార్మసీ, ఎం ఫార్మసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ నర్సింగ్, హోటల్ మేనేజ్‌మెంట్, బీఈ, బీటెక్, ఎంటెక్, బీఏ, బీఎస్సీ, బీకామ్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎస్సీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్హత కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు హాజరయ్యారు. 38 పైగా కంపెనీల్లో ఉద్యోగాలకు ఆయా కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వాటి ఆధారంగా కంపెనీల్లో రూ.15వేల మొదలుకొని రూ.40 వేల వరకూ జీతం లభించే ఉద్యోగాలకు 508 మందిని ఎంపిక చేసి నియామాక ఉత్తర్వులు నాయకుల చేతుల మీదుగా అందజేశారు. నియామక పత్రాలు పొందిన ఉద్యోగస్తులు మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కే. సంజీవరావు, జిల్లా ఉపాధి కల్పనాధికారి డి. దుర్గాబాయి, సీడప్ జేడీయం రాంబాబు, మంగళగిరి పట్టణ అధ్యక్షులు పడవల మహేష్, మంగళగిరి మండల అధ్యక్షులు పల్లబోతుల శ్రీనివాసరావు, దుగ్గిరాల మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, మంగళగిరి పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, మంగళగిరి మండల ప్రధాన కార్యదర్శి మల్లవరపు వెంకట్, దుగ్గిరాల మండల ప్రధాన కార్యదర్శి తాళ్ళ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రేవేంద్రపాడులో జరిపిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో అధికారులు

పురుగు మందులు వాడకాన్ని తగ్గించండి

ప్రజాశక్తి - దుగ్గిరాల

పురుగు మందులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించుకున్నట్లైతే ఖర్చుతో పాటు నాణ్యమైన , ఆరోగ్యకరమైన పంట పండించవచ్చునని మండల వ్యవసాయ అధికారి ఆర్ విజయ బాబు అన్నారు. మండలంలోని రేవేంద్రపాడు మోరం పూడి గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు తగు సూచనలు చేశారు. పురుగుమందుల వాడకం తగ్గించుకునేందుకు ప్రత్యామ్నాయ పంట రక్షణ చర్యలుగా పసుపు రంగు జిగురు అట్టలు లింగాకర్షణ బుట్టలు గురించి డెమో నిర్వహించారు. జీవ ఎరువులు అయినా భాస్వరం కరిగించే బ్యాక్టీరియా మరియు పొటాషియం విడుదల చేసే బ్యాక్టీరియా ద్రవరూప జీవ ఎరువులు పంపిణీ చేసి ఉపయోగించే విధానాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పలుకూరి మేరమ్మ ఎంపీటీసీ మధు వాసిరెడ్డి శ్రీనివాసరావు కె శ్రీనివాసరావు ఏఈఓ ప్రజ్ఞ గ్రామ కార్యదర్శి కే శ్రీనివాసరావు తదితరులు పాల్గన్నారు.

ప్రతిరైతూ ఈ-క్రాప్‌లో నమోదవ్వాలి

మండల వ్యవసాయ అధికారి ఎన్.శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాశక్తి - కొల్లిపర

రైతులకు బీజామృతం తయారీ విధానాన్ని చూపిస్తున్న వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రెడ్డి

మండలంలోని పిడపర్రు, పిడపర్తిపాలెం గ్రామము ల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఎన్ శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ కౌలు రైతులు కౌలు కార్డులు తప్పనిసరిగా తీసుకొవాలని, దానివలన కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ప్రకృతి వ్యవసాయం చేయుటకు బీజామృతం తయారు చేయు విధానం చేసి చూపించారు. పంట నమోదు ప్రక్రియ ప్రారంభం అయినందున ప్రతి రైతు తప్పనిసరిగా ఈ -క్రాప్ చేయించుకోవాన్నారు. జాతీయ ఆహార భద్రత మెషిన్ కింద మినుము విత్తనములు మినీ కిట్లు అందజేస్తామని, ప్రధాని మంత్రి ఫసల్ బీమా కింద వరి, మినుము పంటలు లకు ఇన్సూరెన్స్ చేసుకొనుటకు ఆగస్టు 15 తేదీ వరకు అవకాశం కల్పించారని ఆయన తెలిపారు. కావున అందరు రైతులు ఈ అవకాశాన్ని సంద్వినియోగ పరచుకోవాలని తెలిపారు.

5జీ సేవలు ప్రారంభించనున్న 'వి'

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

విశాఖపట్నం, తిరుమలలో 5జీ సర్వీసులు ప్రారంభిస్తున్నట్లు టెలికాం దిగ్గజం వి సంస్థ ఇంచార్జి కె.ప్రతాప్ ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా తమకు 5జీ స్పెక్ట్రం ఉన్న 17 ప్రయారిటీ సర్కిల్స్‌లోని పలు నగరాల్లో 5జీ సేవలను ప్రవేశపెట్టే ప్రక్రియలో ఇది భాగమని అన్నారు. దశలవారీగా 5జీ విస్తరణలో భాగంగా వి ఇప్పటికే పలు పట్టణాల్లో 5జీ సేవలను ప్రవేశపెట్టిందని తెలిపారు. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో వి కొత్త తరం కనెక్టివిటీని పొందే మొదటి నగరంగా విశాఖపట్నం నిలుస్తుందన్నారు. విశాఖపట్నం, తిరుమలలో 5జీ ఎనేబుల్డ్ డివైజ్‌లు గల వి యూజర్లు 5జీ సర్వీసులను పొందవచ్చని తెలిపారు.

తెలుగు కార్యశాల గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్

విజయవాడలోని పి.బి.సిద్దార్థ కళాశాల స్వర్ణోత్సవ సంవత్సర కార్యక్రమంగా సిద్ధార్థ తెలుగుశాఖ, మైసూరులోని సిఐఐఎల్ (సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజస్), నేషనల్ టెస్టింగ్ సర్వీస్ ఇండియా సంయుక్త సౌజన్యంతో తెలుగులో పరీక్షలు, మూల్యాంకనం, ప్రశ్నాంశ రచనపై ఆగస్టు 18 నుంచి 23 వరకు 6 రోజుల పాటు శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.మేకా రమేష్ తెలిపారు. బుధవారం కార్యశాల గోడపత్రిక (పోస్టర్)ను ప్రిన్సిపాల్ డా.మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, తెలుగు సహాయక ఆచార్యులు డాక్టర్ ఎన్.శివకుమార్, డాక్టర్ పి.బి.డి.వి.ప్రసాద్, డాక్టర్ వై.పూర్ణచంద్రరావు, డాక్టర్ కె.హేమబాంధవి, డాక్టర్ సశ్రీ ఆవిష్కరించారు. తెలుగు ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు ఆగస్ట్ 13లోగా దరఖాస్తు చేసుకోవాలని, ఎంపికైన వారికి ఆన్ డ్యూటీ సదుపాయం, గౌరవ పారితోషికం, భత్యం అందిస్తామని, దరఖాస్తు కోసం 99898 44001 నెంబరును సంప్రదించాలన్నారు.

పిఇటిపై మరోసారి విచారణ

ప్రజాశక్తి - పెదకాకాని

ఎన్‌సిసి విద్యార్థులకు దుస్తుల కోసం ప్రభుత్వం నుంచి వారి ఖాతాల్లో సంవత్సర బడ్జెటును అనుసరించి డబ్బులు వేస్తారు. మండల పరిధిలోని వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాల పూర్వ ఎన్‌సిసి ఉపాధ్యాయుడు మస్తాన్ రెడ్డి విద్యార్థులతో వారి ఖాతాల నుండి డబ్బులు డ్రా చేయించి వాటితో నాసిరకం దుస్తులు కొన్నారనీ, మిగిలిన డబ్బులను తను వాడుకున్నాడని ఆరోపణలు రావడంతో ఆర్మీ అధికారులు అతనిపై మరొకసారి బుధవారం విచారణ జరిపారు. విద్యార్థుల వద్ద నుండి లిఖిత పూర్వకంగా స్టేట్‌మెంట్ తీసుకున్నారు. ప్రస్తుతం మస్తాన్ రెడ్డి నంబూరు జిల్లా పరిషత్ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తూ మెడికల్ లీవ్‌లో ఉన్నారు. కార్యక్రమంలో ఆర్మీ జూనియర్ ఆఫీసర్ రాముడు,హౌల్దార్ మహేష్, క్యాడర్ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

నిత్య అన్నదానానికి సహకరించండి

ప్రజాశక్తి - పెదకాకాని

మండల కేంద్రమైన పెదకాకానిలోని శ్రీ మల్లేశ్వర స్వామి వారి దేవస్థాన నిత్య అన్నదానానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్ కోరారు. బుధ వారం మంగళగిరికి చెందిన పలగాని నరసింహా రావు, శివ నాగేశ్వరమ్మ దంపతులు రూ. 50వేలు విరాళం అందించినట్లు ఆయన తెలిపారు. దాతల కు ప్రత్యేక దర్శనం, వేద ఆశీర్వచనం చేయించి శ్రీ స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి చిత్రపటం అందజేశారు.

దాడి కేసులో మూడేళ్లు జైలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

వృద్ధునిపై దాడి చేసిన వ్యక్తికి మూడు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించారు. ఈ కేసులో బాధితుల తరపు న్యాయవాది పిన్నమనేని పాములయ్య తెలిపిన వివరాలు ప్రకారం 2019లో అచ్చంపేట మండలం రుద్రవరం గ్రామానికి చెందిన చల్లా శివ నాగేశ్వరరావుకు, అదే గ్రామానికి చెందిన గడ్డం యజ్ఞనారాయణ మధ్య స్థలం, పొలానికి సంబంధించి ఘర్షణ జరిగింది. ఘర్షణలో గాయపడిన చల్లా శివనాగేశ్వరరావు అచ్చంపేట పోలీస్ స్టేషన్లో చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు జరిపి కేసును సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి కోర్టుకు పంపారు. సీనియర్ సివిల్ జడ్జి విజయ్‌కుమార్ రెడ్డి విచారణ జరిపి నిందితుడు గడ్డం యజ్ఞ నారాయణకు తీర్పు చెప్పారు. ఈ తీర్పు పట్ల బాధితుడు చల్లా శివ నాగేశ్వరరావు సంతృప్తిని వ్యక్తం చేశారు.

లింకు దస్తావేజులు పోయినవి

తెలప్రోలు శ్రీనివాసరావు, తండ్రి: కృష్ణారావు అను నా తాలూకు ఆస్తికి సంబంధించిన చిలకలూరిపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిష్టరు కాబడిన నెం. 2620/1994 నెంబరు గల లింకు దస్తావేజును తీసుకుని ది. 09.06.2025వ తేదిన చిలకలూరిపేట మండలం గోపాళంవారి పాలెం నుండి బొప్పూడి గ్రామానికి వస్తుండగా మార్గమధ్యలో ఎక్కడో పడిపోయినది. కావున దస్తావేజు దొరికిన వారు దయచేసి నాకు అందించగలరని మనవి.

చిరునామా:
తెలప్రోలు శ్రీనివాసరావు,
చిలకలూరిపేట, పల్నాడు జిల్లా.
సెల్ నెం. 8106154224.

పాఠశాల బస్సు ఢీకొని తల్లీకూతుళ్లకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- తాడేపల్లి

పెనుమాక ప్రభుత్వ కళాశాల దగ్గర బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీకూతుళ్లకు తీవ్రగాయాలయ్యాయి. తాడేపల్లి పోలీసులు కథనం ప్రకారం.. ఎర్రబాలెం నుంచి పెనుమాక వైపు వస్తున్న ద్విచక్ర వాహనాన్ని, పెనుమాక నుంచి ఎర్రబాలెం వైపు వెళుతున్న శ్రీ చైతన్య బస్సు బలంగా ఢీకొంది. సంఘటనలో ద్విచక్ర వాహనం మీద వెళుతున్న ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని అలివేలు, ప్రత్యూషగా పోలీసులు గుర్తించారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బస్సు డ్రైవర్‌ని అదుపులోకి తీసుకొని పోలీసులు కేసు విచారిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రమాదంలో గాయపడిన మహిళ

పంట నమోదు తప్పనిసరి

మండల వ్యవసాయాధికారి సుగుణ బేగం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రభుత్వం ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియలో పంట నమోదు తప్పనిసరి అని ప్రత్తిపాడు మండల వ్యవసాయ అధికారి సుగుణ బేగం అన్నారు. ప్రత్తిపాడు నియోజక వర్గ కేంద్రంలోని ప్రత్తిపాడు. వంగిపురం, వట్టిచెరుకూరు మండలం సౌపాడు గ్రామలలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారులు మాట్లాడుతూ రైతులకు (కౌలు రైతు కార్డు)ల ప్రాముఖ్యతను వివరించారు. రైతు సేవ కేంద్రం సిబ్బంది లేదా రెవెన్యూ అధికారి సంప్రదించి కౌలు కార్డును పొందాలని తెలిపారు. డిజిటల్ క్రాప్ సర్వే గురించి తెలియజేసారు. కిసాన్ డ్రోన్స్ 80శాతం సబ్సిడీ పై అందుబాటులో ఉన్నాయని ఆసక్తి గలవారు రైతుసేవ కేంద్రం సిబ్బందిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రధాన

మంత్రి ఫసల్ బీమా ద్వారా రైతులు వరి పైరు ఎకరాకు రూ.800 ప్రీమియం చెల్లించి వంట బీమా చేయించుకోవాలని తెలిపారు. ప్రకృతి వల్ల నష్టం సంభవించినపుడు ప్రభుత్వం బీమా నష్టపరిహారం చెల్లిస్తుందన్నారు. రైతులు రాబోయే ఖరీఫ్, రబీలో వరి, అపరాల పైర్లకు బీమా ప్రీమియం చెల్లించి రక్షణ పొందాలని సూచించారు. కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చట్టం చేయండి

ప్రజాశక్తి - తెనాలి

మరో రెండు నెలల్లో ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ కాలపరిమితి ముగియనున్న నేపథ్యంలో ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకోవాలని ఏపీ ఎంఆర్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఉసురు పాడు బ్రహ్మయ్య మాదిగ కోరారు. స్థానిక ఎస్సార్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఎమ్మార్పీఎస్ నాయకులు సమావేశం అయ్యారు. జిల్లా అధ్యక్షులు కిన్నెర నాగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బ్రహ్మయ్య మాదిగ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు సుప్రీం కోర్టు చారిత్రక

తీర్పు నిచ్చిన నేపథ్యంలో వర్గీకరణ చట్టం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. చట్టం చేయడం ద్వారా ఎస్సీ వర్గీకరణ ఫలితాలు దక్కుతాయని చెప్పారు. దీనిపై భవిష్యత్ కార్యాచరణకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కోనా శ్రీనివాస రావు, వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ నియంత్రణ, నివారణపై అవగాహన

ప్రజాశక్తి - తాడికొండ

మండలంలోని లాం గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ఫ్లోరోసిస్ నియంత్రణ, నివారణపై గ్రామస్థాయి కమ్యూనిటీ హెల్త్ అధికారులకు, మండలస్థాయి సూపర్వైజంలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుంటూరు జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణ అధికారి డాక్టర్ గిరిధర్ కుమార్ హాజరై ఫ్లోరోసిస్ నియంత్రణ, నివారణ గురించి అవగాహన కల్పించారు. ఆయన మాట్లా డుతూ ఫ్లోరోసిస్ ఏ విధంగా వ్యాపిస్తుంది, దాన్ని ఏ విధంగా నివారించాలి తదితర అంశా లను తెలిపారు. బోర్‌వెల్ తాగునీటి ద్వారా, పొగాకు సంబంధిత వస్తువుల ద్వారా, బ్లాక్ సాల్ట్, బ్లాక్ టీ వంటివి మితిమీరి ఉపయోగిస్తే ప్రజలు త్వరగా ఫ్లోరోసిస్ వ్యాధి బారిన పడతారని తెలిపారు. పాఠశాలల్లో చదువుతున్న 3, 4, 5 తరగతి పిల్లలందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలనీ, గ్రామాలలో కమ్యూనిటీ సర్వే చేయాలని తెలిపారు. నివారణలో భాగంగా రక్షిత తాగునీరు, క్యాల్షియం, విటమిన్ సి, ఇ, అధికంగా పోషకాలున్న కూరలు, పండ్లు తీసుకోవాలన్నారు. అవగాహన కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ వి.ప్రియాంక ఏఎన్ఎమ్, అంగన్వాడీ, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు దుర్మరణం

ప్రజాశక్తి - ఫిరంగిపురం

ఫిరంగిపురం మండలం వేములూరిపాడు గ్రామంలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు దుర్మరణం చెందాడు. గ్రామానికి చెందిన పచ్చల అబ్రహాం (76) కూలికోసం తన సైకిల్‌పై గుంటూరు వైపు వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. ఉదయం 7:40 సమయంలో నేషనల్ హైవేపై వెళ్తున్న అబ్రహాంను ఫిరంగిపురం వైపు నుంచి యమహా మోటారు బైకుపై వచ్చిన గంగనబోయిన గణేష్ అనే యువకుడు ఢీకొట్టాడు. సంఘటనలో అబ్రహాం తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అతివేగమే సంఘటనకు కారణమని ప్రత్యక్షసాక్షులు తెలిపారు. గాయపడిన గణేష్‌ను చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. ఫిరంగిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

షాక్ కొడుతున్న విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి- తాడేపల్లి

ఒకపక్క విద్యుత్ ఛార్జీలు పెంచి కూటం ప్రభుత్వం ప్రజలకు షాకిస్తే, తాడేపల్లి పట్టణంలోని ముగ్గురోడ్డులో ఉన్న విద్యుత్ స్తంభం షాక్ కొట్టడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే నలుగురు పిల్లలు ఈ విద్యుత్ స్తంభాన్ని పట్టుకొని షాక్‌కు గురయ్యారు. ప్రమాదం ఏమీ జరగలేదు కాబట్టి స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. జరగరాని ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. స్థానిక విద్యుత్ శాఖ అధికారులకు సమస్య తెలిపినా మా వల్ల కాదని వెళుతున్నారని బాధితులు చెబుతున్నారు. విద్యుత్ ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఉద్యోగుల పెండింగ్ బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - తెనాలి

ఉద్యోగులకు దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న బకాయిలను తక్షణమే చెల్లించాలని ఎపి ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ తెనాలి యూనిట్ అధ్యక్షులు శివరాత్రి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో బుధవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. ఉద్యోగులకు రెండు సంవత్సరాలుగా ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలపై చర్చించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగులకు చెల్లించిన బకాయిలపై ఇప్పటివరకు మాట్లాడ లేదని, తక్షణమే ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. బకాయిలు చెల్లింపుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి కె.కమలకుమారి, నాయకులు ఎ.బాలచంద్రమౌళి, డి.శ్రీనివాసరావు, డి.సుధీర్‌బాబు పాల్గొన్నారు.

పురపాలక సంఘ కార్యాలయము, తెనాలి

బహిరంగ వేలము నోటీసు

ఆర్.ఒ.సి.నెం.87/2022/ఎ1. **తేది: 06-08-2025**

తెనాలి పురపాలక సంఘ పరిధిలోని దిగువ తెలిపిన చేపల చెరువుకు సంబంధించిన బహిరంగ వేలము నోటీసు ఈ క్రింద తెలియజేయబడిన విధముగా ది.13-08-2025, బుధవారము ఉదయం గం.11.00 లకు పురపాలక సంఘ కార్యాలయము నందు మున్సిపల్ కమీషనరు గారిచే గాని వారి అనుమతి పొందిన మరి ఏ ఇతర అధికారిచే గాని బహిరంగ వేలము నిర్వహించబడును.

వ.నెం.	వేలం నిర్వహణ అంశము పేరు	ప్రారంభ ధరావత్తు (రూ.)	దాఖలు చేయవలసిన సాల్వెన్సీ
1	చేపల చెరువు - ఐతానగర్	10,000/-	1,00,000/-

వేలం పాటలో పాల్గొనదలచిన వారు ముందుగా పై ప్రకటించిన విధముగా ధరావత్తు సొమ్ము, సాల్వెన్సీ ధృవపత్రము మరియు ఇ.సి. ధృవ పత్రములు ముందుగా దాఖలు చేసి వేలములో పాల్గొనవలెను. సాల్వెన్సీ ధృవపత్రము లేనివారు సాల్వెన్సీ మొత్తమును నగదు రూపములో పురపాలక సంఘమునకు చెల్లించి పాటలో పాల్గొన వచ్చును. వేలం తేదీలు మార్పు చేయు విషయములో కమీషనర్ గారికి పూర్తి అధికారము కలదు. ఇతర వివరములు కార్యాలయ పనివేళల యందు రెవిన్యూ సెక్షన్ నందు సంప్రదించవచ్చును.

సం/- కమీషనరు
తెనాలి పురపాలక సంఘము.

IN THE COURT OF THE IV ADDITIONAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT GUNTUR
E.P. No.131 of 2023
in
O.S. No. 249 of 2016

Between
Surapareddy Ankamma □Decree Holder
And
1. Rizwana Begum
2. Mohammad Jaseen Ahammad
3. Raisa Kousar □Judgement Debtors

All are Residents of H. No:11-842/2A, C/o. T. Rami Reddy, Pattabhi Sitharam Nagar, 1st lane, 3rd Cross Road, Amaravathi Road, Nagaralu, Guntur City, Guntur District □ 522034.

డిక్రీహోల్డర్ పైన నెంబరు గల ఎగ్జిక్యూషన్ పిటీషన్‌ని డిక్రీ అమలు చేయమని దాఖలు చేయగా జెడిఆర్ నెం.1, 2 మరియు 3 వారికి నోటీసు నిమిత్తం ది. 19-8-2025వ తేదీకి శ్రీ కోర్టువారు వాయిదా వేసినారు. కావున పైన తెలిపిన తేదీన పై కోర్టు నెంబరుకు ఉదయం 10-30 గం.లకు జెడిఆర్ నెం.1, 2 మరియు 3 స్వయంగా గానీ, లేదా న్యాయవాది ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు వున్న యెడల తెలియజేయగలరు. లేనియెడల మీ పరోక్షముగా తీర్మానించ బడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది : 19-8-2025

NARRA SRINIVASA RAO
Advocate for DHR,
Rushi Valley Homes,
Srinivasa Rao Thota, Guntur- 522004.
Mobile No.9160796244

SUIT SUMMONS
IN THE COURT OF THE V JUNIOR ADDITIONAL CIVIL JUDGE AT GUNTUR.
O.S. No:175/2024

Between:
Canara Bank, 4/9 Brodiepet, Guntur,
Rep. by it's Chief Manager. □ Plaintiff
And
Mothadaka Venkata Ravikanth Deepak □Defendant

To:
Mothadaka Venkata Ravikanth Deepak,S/o.Sri Rama Murthy,D. No. 26 34-6, Near Water Tank,8th Lane, A.T.Agraharam, Guntur Collectorate,Guntur - 522 004.

పై నెంబర్ దావాని ప్రతివాది నుంచి (బిజినెస్ లోన్) బాకీ వసూలు పరుచుకొను నిమిత్తం దాఖలు చేయగా, అందుపై ప్రతివాదికి అనేక మార్లు నోటీసులు పంపిననూ (కోర్టు ద్వారా) బుద్ధి పూర్వకంగా తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. శ్రీ కోర్టు వారి ఆర్డర్ పై ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయుటకు గాను పై నెంబర్ దావా ది. 18-08-2025 కు వాయిదా అయి ఉన్నది. పైన చూపిన/తెలిపిన కోర్టులో స్వయంగా గాని, అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరు కాబడి ఆక్షేపణలు తెలుపవలసినది. లేని యెడల పరోక్షమున తీర్మానించెదరు.

(By the Order of the Court)
వాయిదా తేది:18-08-2025

బి.వి.ఆర్.ప్రసాద్,
వాది తరఫున అడ్వకేట్,
6/19 బ్రాడీపేట, గుంటూరు.
సెల్ :85209782000

In the court of the Hon'ble III Additional Civil Judge [Junior Division] Vijayawada
I.A.No. 263/2022
in
O.S.No. 786/2022

Between: Ravela Srinivas Rao ... Petitioner
And
Thotakura Ramesh & 3 others ... Respondents

Notice to 4th Respondent
Gogineni Satya Prasad, S/o. Venkata Ratnam, R/o. Door No. 11-5-15/12, Chandra Mouli Nagar, Sattenapalli - 522403, Guntur District.

పై నెంబరు పిటీషన్ నందు 4వ రెస్పాండెంట్ అయిన మీకు శ్రీ కోర్టు వారు ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ ప్రకటన ద్వారా మీరు పై కోర్టు వారి ఎదుట ది. 21-08-2025 ఉ॥ 10-30 ని॥లకు స్వయముగా గానీ, న్యాయవాది గారి ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకోవలెను లేని యెడల పై పిటీషన్‌ను మీ పరోక్షమున తీర్మానింపబడును.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం
ఇట్లు
K.V. Ranga Rao
Advocate
Vijayawada. Ph: 7396873555
వాయిదా తేది: 21-08-2025

రైతులకు నిత్యం అందుబాటులో ఉండండి

- పొగాకును సాగు చేయనీయొద్దు
- ఎరువులు, పురుగు మందుల కొరత రానివ్వొద్దు
- వ్యవసాయధికార్లతో సమీక్షలో కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తమవుతున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు నిత్యం రైతులకు అందుబాటులో ఉండి సలహాలు, సూచనలు అందజేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎం.జగ్గారావు, వ్యవసాయ సహాయ సంచాలకులతో నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ బుధవారం సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా వర్షపాతం నమోదు, సాధారణ పంట సాగు విస్తీర్ణం, ప్రత్యామ్నాయ పంటల సాగు, ఎరువుల లభ్యత, కౌలుదారు హక్కు పత్రాలు, కౌలు రైతులకు పంట రుణములు పంపిణీ తదితర అంశాలపై చర్చించారు. ఖరీఫ్ సీజన్లో పొగాకు సాగును పూర్తిగా నిషేధించాలని, రబీ కాలానికి వరి సాగుకు సాగర్ నీరు విడుదల చేయడం సాధ్యపడదని గ్రామస్థాయిలో తెలపాలన్నారు. ప్రస్తుతం వివిధ పంటల సాగు విస్తీర్ణం పెరుగుతున్న నేపథ్యంలో సరిపడా ఎరువులు, పురుగు మందులు రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రతి 10 రోజులకు ఒకసారి ఎరువులు, విత్తన దుకాణాలను తనిఖీ చేయాలన్నారు. ప్రతిరోజూ రైతులకు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి జగ్గారావు మాట్లాడుతూ ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు రైతులు మొగ్గ చూపేలా శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని, రైతు వారీగా ప్రత్యామ్నాయ పంటలు సాగు వివరాలను సేకరించాలని చెప్పారు. సకాలంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందజేసే ప్రణాళికలు రూపొందించాలన్నారు.

వ్యవసాయాధికారుల సమీక్షలో మాట్లాడుతున్న పల్నాడు కలెక్టర్ అరుణ్‌బాబు

స్వాతంత్ర్య దినోత్సవాలకు మంత్రి మనోహర్

నరసరావుపేటలోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవాల్లో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొని జిల్లా ప్రగతి నివేదికను చదువుతారని కలెక్టర్ తెలిపారు. వేడుకల సన్నద్ధతపై అధికారులతో సమీక్షించిన కలెక్టర్ మాట్లాడుతూ ఏడాది కాలంలో ఏం చేశాం, రానున్న రోజుల్లో చేయాల్సిన పనుల గురించి చెబుతూ ప్రగతి నివేదికల తయారీ, శకటాల నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్లాస్టిక్ రహిత స్వాతంత్ర్య దినోత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మురళి, అదనపు ఎస్‌పి జెవి సంతోష్, ఆర్డీఓ కె.మధులత, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అక్రమార్కులే మారారు.. బియ్యానిది మాత్రం పక్కదారే..

- నల్లబజారుకు యథేచ్ఛగా రేషన్ బియ్యం
- తనిఖీలలోనూ పట్టుబడకుండా అవినీతి
- రాజకీయ ఒత్తిళ్లతో నిస్తేజంగా అధికారులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ప్రభుత్వం మారడంతోపాటు రేషన్ అక్రమాలకు పాల్పడేవారూ మారారు.. అక్రమాలు మాత్రం యథావిధిగానే కొనసాగుతున్నాయి. వందల టన్నుల బియ్యం కార్డుదారులకు కాకుండా నల్లబజారుకు చేరుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. గతంలో కొద్దిమేర తనిఖీలు చేసి రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నా ప్రస్తుతం అదేమీ జరగడం లేదనే విమర్శలూ వస్తున్నాయి.

చిలకలూరిపేట పట్టణంలో 44 మంది, మండలంలో 48 మంది మొత్తంగా 92 మంది రేషన్ డీలర్లు ఉన్నారు. వీరు సుమారు 90 టన్నుల బియ్యాన్ని ప్రతినెలా తమ కోటా కింద ప్రభుత్వం నుండి తీసుకుంటున్నారు. అయితే వీటిల్లో 80 శాతం బియ్యాన్ని అంటే సుమారు 75 టన్నుల వరకు కార్డుదారులకు పంపిణీ చేయకుండా నల్లబజారుకు తరలిస్తున్నారు. బియ్యానికి బదులు కార్డుదారులకు కిలోకి రూ.10 చొప్పున ఇస్తున్నారని, వాటిని దళారులకు రూ.18కి అమ్ముకుంటున్నారని, వారు రూ.45 చొప్పున వ్యాపారులకు అమ్ముతుండగా వాటిని పాలీష్ చేసి ఇతర బియ్యంలో కలిపడం ద్వారా కిలో రూ.65 చొప్పున అమ్ముకుంటున్నారని సమాచారం. ఈ క్రమంలో కొంతమంది డీలర్లు 20వ తేదీనే తమ కోటా బియ్యాన్ని తెచ్చుకుని ఒకటో తేదీ నాటికే వాటిని అక్రమమార్గాలకు తరలిస్తున్నారని తెలిసింది. దీన్ని అడ్డుకోవాల్సిన అధికారులు నిస్తేజంగా ఉన్నారని, అధికార పార్టీ నేతల ఒత్తిడే దీనికి కారణమని, డీటర్లలోనూ వారే ఉన్నారనే ఆరోపణలు ఉన్నాయి.

గత ప్రభుత్వ హయాంలో గణపవరంలో ఓ ఎమ్‌డియు వాహనదారుడు ఏకంగా డీలర్ల నకిలీ వేలి ముద్రలు చేయించి 17 క్వింటాళ్ల బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తుండగా అధికారులు పట్టుకున్నారు. అయితే అప్పటి నాయకుల ఒత్తిడితో అరగంటలోనే అతన్ని విడిచిపోయారు. మరో డీలర్ గణపవరం నుండి నరసరావుపేటకు ప్రైవేటు వాహనంలో బియ్యాన్ని తరలిస్తుండగా అధికారులు వెంబడించడంతో తప్పించుకోబోయి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. బియ్యం తరలించేందుకు కూలి పనికి వచ్చిన ఇద్దరు బీటెక్ విద్యార్థులు ఈ ప్రమాదంలో చనిపోవడం అప్పట్లో సంచలనమైంది. ఈ విధంగా పలు సందర్భాల్లో అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం వెయ్యి టన్నుల వరకు చిలకలూరిపేటలోని ఎఫ్‌సిఐ గోదాములు ఉన్నాయి. అయితే అక్రమార్కులపై నామమాత్రపు కేసులతో సరిపెట్టడంతో దీన్ని అలుసుగా తీసుకుంటున్న అక్రమార్కులు వందల టన్నుల రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించి రూ.కోట్లు గడిస్తున్నారు.

ఏజీపీగా గంగుల శ్రీనివాసరావు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా గంగుల శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. తన నియామకానికి సహకరించిన మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. శ్రీనివాసరావుకు సీనియర్ న్యాయవాదులు కర్పూరపు వెంకట రంగారావు, షేక్ గాలీబ్ సాహెబ్, ఆవుల ఉదయ్ కుమార్‌రెడ్డి, పివిజి.శ్రీనివాసరావు, గౌస్‌బాషా, వై.కృష్ణమూర్తి, నాగూర్ జానీ, కాశీం, అనిల్ శుభాకాంక్షలు తెలిపారు.

ఫోన్లను మూటగా కట్టి సిడిపిఒ కార్యాలయం వద్దకు వచ్చిన అంగన్వాడీలు

ఒక్క ఫొటో తీయడానికి నాలుగైదు సార్లు..!

పని చేయని ఫోన్లను సిడిపిఒ కార్యాలయంలో అప్పగించిన అంగన్వాడీలు

ప్రజాశక్తి - పెదకూరపాడు

పనిచేయని ఫోన్లు తమకొద్దని అంగన్వాడీలు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఐసిడిఎస్ కార్యాలయంలో బుధవారం అందజేశారు. బెల్లంకొండ మండలానికి చెందిన అంగన్వాడి కార్యకర్తలు మండలంలోని తాళ్లూరులో ఉన్న ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో ఫోన్లను ఇవ్వడానికి రాగా సిడిపిఒ అందుబాటులో లేకపోవడంతో ఆమె బల్లపై పెట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ లబ్ధిదారుల ఫొటోలు తీయాలన్నా ఫోన్లు పనిచేయడం లేదని, ఒకటికి నాలుగు సార్లు ఫొటో తీయాల్సి వస్తోందని ఆవేదన వెలిబుచ్చారు. కొత్త ఫోన్లు ఇవ్వాలని కోరారు. అంగన్వాడీలు తాము ఎప్పుడు విరమణ చేస్తే అప్పుడే గ్రాడ్యుటి కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులమనే పేరుతో తల్లికివందనం పథకానికి తమను అనర్హులను చేశారని, తెల్లరేషన్ కార్డులూ ఇవ్వడం లేదని, మరి సమాన పనికి సమాన వేతనం ఎందుకివ్వరని ప్రశ్నించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.సూరిబాబు, యూనియన్ నాయకులు విజయలక్ష్మి, శోభ, మల్లేశ్వరి పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ పిడుగురాళ్ల మండల నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) పిడుగురాళ్ల మండల ప్లీనరీ సమావేశం స్థానిక సిఐటియు కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా కడియం రోహిత్, అల్తాఫ్, ఉపాధ్యక్షులుగా రామకృష్ణ, సహాయ కార్యదర్శిగా యాసిన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కన్వీనర్ కె.సాయికుమార్ మాట్లాడుతూ విద్యార్థి సమస్యలపై ఎస్ఎఫ్ఐ చేసిన పోరాటాలను గుర్తు చేశారు. జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం పథకం కోసం, విద్యార్థులకు పాఠ్యపుస్తకాల కోసం అనేక రకాల ఉద్యమాలు చేశామన్నారు. పిడుగురాళ్ల పట్టణంలో గ్రంథాలయం నిర్మించాలని, 10 సెంట్ల స్థలాన్ని కేటాయించాలని బహుముఖ రూపాల్లో కృషి చేశామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యార్థి సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపడం లేదని, విద్యాసంస్థల్లోకి విద్యార్థి సంఘాలను వెళ్లనీయకుండా, విద్యార్థుల సమస్యలు చెప్పుకోడానికి వీల్లేకుండా దొంగజీవోలు ఇస్తోందని విమర్శించారు. సమావేశం అనంతరం ఎంఇఒ కార్యాలయం వద్ద విద్యార్థులు, నాయకులు నిరసన తెలిపారు. విద్యార్థుల ప్రజాస్వామ్య హక్కులను హరించే ఉత్తర్వులను రద్దు చేయాలని ఉత్తర్వు కాపీలను దహనం చేశారు. ఎంఇఒ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

ఎంఇఒకు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థులు, నాయకులు

ప్రమాదాలకు నెలయాలుగా 35 ప్రాంతాలు

మాట్లాడుతున్న పల్నాడు ఎస్పీ కె.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రోడ్డు ప్రమాదాలకు నివారణకు, సురక్షిత ప్రయాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పెట్రోల్ బంకు యజమానులు, గ్యాస్ డీలర్లతో నరసరావుపేటలోని జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెట్రోలియం ఉత్పత్తులు రోడ్డు ద్వారా సురక్షిత రవాణాకు తీసుకోవాల్సిన చర్యలు, మార్గదర్శకాలపై వివరించారు. పెట్రోలియం ఉత్పత్తుల రవాణాకు సంబంధించిన చట్టబద్ధ నియమాలను పాటించాలన్నారు. అత్యంత రద్దీ ప్రాంతాలు దాటేటప్పుడు ప్రజా భద్రతను పరిగణనలోకి తీసుకోవాలని3, ఎక్కువ దూరాల రవాణా సమయంలో డ్రైవర్‌తో పాటు ప్రత్యామ్నాయ డ్రైవర్‌ను నియమించాలని, డ్రైవర్లకు తరచూ వైద్య పరీక్షలు చేయించాలని చెప్పారు. పల్నాడు జిల్లాలో మొత్తం 35 బ్లాక్ స్పాట్లను గుర్తించామని, ఆ ప్రదేశాల్లో సురక్షిత చర్యలను అమలు చేయాలని ఆదేశించారు. పెట్రోల్ బంకులు, గ్యాస్ ఏజెన్సీల దగ్గర రోడ్డు ప్రమాదాలు, మత్తు పదార్థాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించేందుకు బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో అడ్మిన్ ఎస్.పి జెవి సంతోష్, మహిళా పోలీస్ స్టేషన్/నరసరావుపేట ఇన్‌ఛార్జి డిఎస్‌పి ఎం.వెంకటరమణ, ట్రాఫిక్ సిఐ లోకనాథం, బిపిసి జిల్లా సేల్స్ ఆఫీసర్ చంద్రకాంత్ నాయక్, ఐఒసిఎల్ జిల్లా సేల్స్ ఆఫీసర్ సాయిప్రకాష్, లీగల్ మెట్రాలజీ శాఖాధికారి అల్లూరయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాయపూడి విద్యుత్‌భవన్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు, దుగ్గిరాలలో అర్జీ అందజేస్తున్న నాయకులు, వల్లభాపురంలో నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

స్మార్ట్ మీటర్లను నిలిపివేయాలని ధర్నా

ప్రజాశక్తి - తుళ్లూరు

పెంచిన విద్యుత్తు చార్జీలను ఉపసంహరించు కోవాలని, ప్రమాదకర స్మార్ట్ మీటర్లను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలం రాయపూడి విద్యుత్ భవన్ వద్ద ప్రజావేదిక, సిఐటియు నాయకులు ధర్నా నిర్వహించారు. ఎం.భాగ్యరాజు అధ్యక్షతన జరిగిన ధర్నాలో సిఐటియు నాయకులు ఎం.రవి మాట్లాడుతూ ట్రూ అప్ ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో బాదుడే బాదుడు కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం ప్రారంభించిందని అన్నారు. మేనిఫెస్టోలో విద్యుత్ ఛార్జీలు పెంచం, చౌకైన, నాణ్యమైన, నిరంతరాయమైన విద్యుత్ అందిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం మాట తప్పి అడ్డగోలుగా ప్రజలపై వినియోగదారులపై విద్యుత్ భారం మోపటం న్యాయమా.. అని ప్రశ్నించారు. ప్రజలు మోయలేని విధంగా ఉన్న ట్రూ అప్ సర్దుబాటు చార్జీల విధానాన్ని పూర్తిగా తొలగించాలని రవి డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం సిఆర్‌డిఎ సర్కిల్ విద్యుత్ ఎస్ఇ ఎం.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రజా వేదిక, సిఐటియు నాయకులు పేరం బాబురావు, కుంభా ఆంజనేయులు, వల్లభాపురం వెంకటేశ్వరరావు, షేక్ జానీ, నండూరి శ్రీరామమూర్తి, కె.రమేష్, ఎర్రగుంట్ల మోషే, పిల్లి సతీష్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల

స్మార్ట్ మీటర్లు ఏర్పాటుకు వ్యతిరేకంగా స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయం వద్ద బుధవారం ప్రజా ఐక్యవేదిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు జెట్టి బాలరాజు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాలను కోరారు. వై.స్టాలిన్, సిపిఐ నాయకులు కరీముల్లా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎన్ యోగేశ్వరరావు వై.బ్రహ్మేశ్వరరావు, బి.అమ్మిరెడ్డి, అద్దంకి పాములు, షేక్ మౌలాలి, ఎస్.ఆంజనేయులు అద్దేపల్లి శేషగిరిరావు, వి.శేషగిరి, వెంకాయమ్మ, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - కొల్లిపర

స్మార్ట్ మీటర్లను ఉపసంహరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కొల్లిపర మండలం వల్లభాపురం గ్రామంలో రైతులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ఉపసంహరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విద్యుత్ వినియోగదారుల నుంచి సంతకాలు సేకరించి గ్రామ సచివాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కేసరి మాధవరెడ్డి వంగాసామిరెడ్డి, వీరారెడ్డి, శివయ్య, నాగరాజు, ప్రసాదు, రైతులు, విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- తాడేపల్లి

స్మార్ట్ మీటర్లు వద్దంటూ తాడేపల్లి పట్టణంలోని సుందరయ్య నగర్, నులకపేట ప్రాంతాల్లో బుధవారం ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, కె.ఉష, ఎస్.గిరిజ మాట్లాడుతూ ప్రజలు కోరకుండానే ఎవరి ప్రయోజనాల కోసం స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మల్లీశ్వరి, యేసయ్య, విశాస్త్రి, నారిన నాగేశ్వరరావు, బి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఇంటింటికి స్టిక్కర్లు

స్మార్ట్ మీటర్ల వ్యతిరేకంగా ఉండవల్లిలో ప్రజావేదిక బుధవారం ఇంటింటికి స్టిక్కర్లు అంటించారు. ఈ సందర్భంగా వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మన్నూరు భాస్కరయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మాట తప్పి, స్మార్ట్ మీటర్లు తెచ్చి ప్రజల నెత్తిన భారాలు మోపిందని విమర్శించారు. ప్రజలు వీటిని వ్యతిరేకించాలని కోరారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వృత్తిదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వల్లభాపురం వెంకటేశ్వరరావు, ఉండవల్లి పార్థసారధి, మస్తాన్ రావు, శంకర్రావు, వెంకటరత్తమ్మ, చంచమ్మ, రజనీ, శివమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దని నులకపేట, సుందరయ్య నగర్‌లలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్య

ప్రజాశక్తి - తాడేపల్లి

32 సంవత్సరాల నుండి అనేక ప్రభుత్వాలు మారిన సిమెంట్ ఫ్యాక్టరీ సమస్య పరిష్కారం కాలేదని, పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యనిలుస్తుందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.ప్రభాకర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల దీక్షలను ప్రారంభించి ఆయన మాట్లాడారు. కార్మికుల విషయంలో కూటమి ప్రభుత్వం చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. కార్పొరేట్లకు ప్రాధాన్యతనిస్తూ, కార్మికులను పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ మూతబడి అర్ధాకలితో 170 మంది కార్మికులు చనిపోయి, ఇప్పటికీ సరైన వైద్యం చేయించుకోలేని పరిస్థితుల్లో కార్మికులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ కార్మిక వర్గం పట్ల కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అభ్యంతరకరమన్నారు.

246వ రోజుకు చేరిన దీక్షలు

ఎసి సి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు బుధవారం నాటికి 246వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి ప్రభాకర్ రెడ్డి ప్రారంభించారు. దీక్షలో రమాదేవి, ఉప్పు కాశమ్మ, అక్కయ్య, సారమ్మ, సుబ్బారావు కూర్చున్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, సూర్య ప్రకాష్ రావు, బి.యేసయ్యా, దుర్గాభవాని, శారద, యెహోషువ, ఇస్రాయిల్, సువర్ణ కుమారి, నాగేశ్వరరావు, డి నాగమల్లేశ్వరి, సిహెచ్ పిచ్చయ్య పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ఆటో కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలిన ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్టిడబ్ల్యుఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు నన్నపనేని శివాజీ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మారుతి సినిమా హాలులో సిఐటియు అనుబంధ ఆటో వర్కర్స్ సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి కె.కుమార్ అధ్యక్షత వహించారు. శివాజీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఆటో రంగ కార్మికులకు జీవో నెంబర్ 21 ద్వారా పెద్ద ఎత్తున ఫీజులు పెనాల్టీలు వసూలు చేస్తున్నారని, ఇవి ఇబ్బందికరంగా ఉన్నాయని వీటిపై తమ ప్రభుత్వం రాగానే జీవో నెంబర్ 21 సవరించి ఫీజులు పెనాల్టీలు తగ్గిస్తామన్నారు. నేటికి సంవత్సరం పూర్తయిన జీవోపై ఎటువంటి స్పష్టత ఇవ్వలేదన్నారు. ఆటోలు, రవాణా వాహనాలు ఫిట్నెస్ టెస్టులు ప్రభుత్వమే చేయాలని ప్రవేట్ వారికి అప్పగించకూడదన్నారు. ఉచిత బస్సు అమలు జరిపే క్రమంలో ప్రత్యామ్నాయంగా డ్రైవర్లు ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించాలన్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు, ప్రత్తిపాడు సిఐటియు నాయకులు కె.ఆదినారాయణ, ఆటో యూనియన్ నాయకులు గాలి నాగరాజు, ప్రసాదు, శ్రీకాంత్, రంగనాయకులు, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శివాజీ

ఎం.బుక్ కార్మికులకు రూ.15వేల వేతనం ఇవ్వాలి

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - మంగళగిరి

ఎం బుక్ కార్మికులకు 15 వేల రూపాయలు వేతనం ఇవ్వాలని సిఐటియు నాయకులు బి.వెంకటేశ్వరావు అన్నారు. ఎంబుక్ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్పొరేషన్ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న దీక్షలు బుధవారం నాలుగో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వెంకటేశ్వరావు మాట్లాడుతూ టిడిపికి చెందిన కాంట్రాక్టర్ ఎం బుక్ కార్మికుల ఒక్కొక్కరి దగ్గర 5000 రూపాయలు కాజేస్తున్నారని విమర్శించారు. కార్పొరేషన్ అధికారులకు, ఇంజనీరింగ్ అధికారులకు తెలియజేసినప్పటికీ సమస్య పరిష్కారం కావడం లేదని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మంత్రి నారా లోకేష్ స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా నాయకులు ఎస్.ఎస్. చెంగయ్య మాట్లాడుతూ కాంట్రాక్టర్ బెదిరిస్తే బెదిరిపోరని అన్నారు. న్యాయంగా వాళ్లకు రావాల్సిన వేతనాన్ని మాత్రమే అడుగుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం.బాలాజీ, ఫెడరేషన్ నాయకులు నారాయణమ్మ, రజిని, పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న డిఎంహెచ్‌ఓ విజయలక్ష్మి

తల్లిపాలు అమృతం : డిఎంహెచ్‌ఒ విజయలక్ష్మి

ప్రజాశక్తి - మంగళగిరి

తల్లిపాలు అమృతం అని డిఎంహెచ్ఓ డాక్టర్ కె.విజయలక్ష్మి అన్నారు. స్థానిక ఇందిరానగర్ యూపీహెచ్సీలో తల్లిపాల విశిష్టతపై తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న డీఎంహెచ్ విజయలక్ష్మి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎ.శ్రావణ్ బాబు మాట్లాడారు. ప్రతి హాస్పటల్లో బ్రెస్ట్ ఫీడింగ్ కార్నర్ లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం తల్లులకు ప్రోటీన్ పౌడర్, పండ్లు, రాగి జావ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూపీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.అనూష, ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ కె.సరిత, ఎయిమ్స్ సీఎఫ్ఎం హెచ్ఓడీ డాక్టర్ రాజీవ్, ఎయిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ముత్తు వెంకటాచలం, డాక్టర్ సుధీంద్ర, ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్వైజర్స్ రత్నకుమారి, శ్రీదేవి, శ్రీ సత్య సాయి ట్రస్ట్ ప్రతినిధి డాక్టర్ రామారావు పాల్గొన్నారు.

చుండూరు మృతవీరులకు నివాళి

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరిలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆర్మీ ట్రస్ట్, ఎస్సీ, ఎస్టీ రైట్స్ అండ్ యాక్ట్ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర కార్యాలయంలో చుండూరు దళిత మృతవీరుల 34 వర్ధంతి జరిగింది. అంబేద్కర్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి చుండూరు దళిత మృత వీరులకు జోహార్లు అంటూ నినాదాలు చేశారు. ఎస్సీ, ఎస్టీ రైట్స్ అండ్ యాక్ట్ రాష్ట్ర కార్యదర్శి కారుమంచి రామారావు మాట్లాడుతూ 1991 ఆగస్టు 6వ తేదీన చుండూరులో జరిగిన మారణహోమాన్ని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కంచర్ల కాశయ్య , సిపిఎం నాయకులు పిల్లలమర్రి బాలకృష్ణ , వైసిపి నాయకులు ఈపూరి ఆదామ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కంతేటి జీవన్ సాగర్, కూర్మాల రాధిక, దళిత నాయకులు పుల్లగురి బాల, కొదమల సంసోను, శ్రీ లక్ష్మీనరసింహ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ మేకల మోహన్ రావు పాల్గొన్నారు.

నాగశ్యామలరావును సత్కరిస్తున్న దేవాంగ సంక్షేమ సంఘం నాయకులు

డాక్టర్ కోట నాగశ్యామలరావుకు సత్కారం

ప్రజాశక్తి - మంగళగిరి

విద్యా వాచస్పతి పురస్కారం అందుకున్న డాక్టర్ కొసనం కోట నాగ శ్యామలరావు మాస్టారును అమరావతి దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చిలువూరు మహంకాళి అమ్మవారి తోట ప్రాంగణంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అభినందన సత్కార సభ నిర్వహించారు. ఈ సభకు సంఘ అధ్యక్షుడు బల్ల వెంకటరమణ అధ్యక్షత వహించి మాట్లాడుతూ శ్యామలరావు మాస్టారు నిరుపేద చేనేత కుటుంబం నుంచి పోరాడుతూ ఆంగ్ల ఉపాధ్యాయుడిగా ఎదిగి, అనేక మంది విద్యార్థులకు మార్గదర్శకులుగా నిలిచారన్నారు. శ్యామలరావు సతీమణి విజయలక్ష్మిని కూడా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి అల్లక తాతారావు, కోశాధికారి అల్లక నమశ్శివాయ, మొతికి వీర వెంకట సత్యనారాయణ, బమ్మన శ్యామ్ కుమార్, యుద్ధం అప్పారావు స్వామి, బీరక మల్లేశ్వరరావు, యర్రా సత్యనారాయణ, పడవల నాగ ప్రసాద్, బాసిన శంకర్, గోరు తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌వైర్లు తగిలి యువకునికి గాయాలు

ప్రజాశక్తి - నకరికల్లు

విద్యుత్ స్తంభం పైనుంచి యువకుడిని దించుతున్న స్థానికులు

11 కెవి విద్యుత్‌వైర్లు తగిలి ఒక యువకుడు గాయపడిన సంఘటన కుంకలగుంట గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, విద్యుత్ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం వారు గ్రామీణ అభివృద్ధిలో భాగంగా రూరల్ డెవలప్‌మెంట్ స్కీం కింద కుంకులగుంట గ్రామంలో కొత్తగా విద్యుత్ లైన్లు వేస్తున్నారు. విద్యుత్ లైన్లు వేసే కాంట్రాక్టర్ కింద కూలీలుగా వెస్ట్ బెంగాల్‌కు చెందిన కొంతమంది పనిచేస్తున్నారు. వారిలో ఒక యువకుడు విద్యుత్ స్తంభంపైకి ఎక్కి పని చేస్తుండగా 11 కెవి విద్యుత్ వైర్లు తగలడంతో కాళ్ళు చేతులు కాలి పోయాయి. స్థానికులు వెంటనే విద్యుత్‌ను నిలిపివేసి యువ కుడిని ఆటోలో నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలిం చారు. ప్రాథమిక చికిత్స అనంతరం యువకుడిని గుంటూరు జిజిహెచ్‌కు తరలించారు. ఎటువంటి ప్రాణాపాయం లేదని ఏఈ గౌస్‌బాషా తెలిపారు.

పిఎమ్‌డిఎస్ విధానం లాభదాయకం

ప్రజాశక్తి - ఈపూరు

ప్రకృతి వ్యవసాయంలో పిఎండిఎస్ (30 రకాల విత్తనాలు) విధానంలో వంటల సాగు రైతులకు లాభ దాయకమని ప్రకృతి వ్యవసాయ జిల్లా శిక్షకులు సైదయ్య అన్నారు. మండల కేంద్రమైన ఈపూరు గ్రామంలో ప్రతి వ్యవసాయ విధానంలో మహిళ రైతు మద్దం ఆదిలక్ష్మి సాగుచేసిన ఏటీఎం మోడల్, దార ప్రకాష రావు సాగుచేసిన వరి మోడల్, కాటం చిన నాగరాజు సాగు చేసిన పిఎండిఎస్ మోడల్‌లో సాగవుతున్న పంటలను ఏఓఆర్ రామారావు గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులతో కలసి బుధవారం సందర్శించారు. సైదయ్య పిఎండిఎస్‌లో పంట కోత ప్రయోగం నిర్వహించగా 53 కిలోలు ఎకరాకు 8.5 టన్నులు దిగు బడి వచ్చిందన్నారు. ఈ సాగు విధానంలో రైతులు దిబ్బ ఎరువులకు వెచ్చించే ఖర్చు తగ్గించుకోవచ్చన్నారు. భూమిలో వివిధ రకాల సూక్ష్మజీవులు, సిలింద్రాలు చేరడం వల్ల భూమి సారవంతం అవుతుం దన్నారు. మిరప, కంది, వరి కూర గాయలు వివిధ రకాల పంటలు వేసే ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయంలో పీఎండీఎస్ విధానాన్ని ఆచరిస్తే పెట్టుబడి ఖర్చులు తగ్గి లాభాలు పొంద వచ్చన్నారు. ఏటీఎం మోడల్ విధానంలో ఆకుకూరలు కూర గాయలు వేయడం ద్వారా నిరంతర ఆదాయం లభిస్తుందన్నా రు. ఎంటి తిరుపతిరావు, డిటిటి శివలక్ష్మి, యూనిట్ ఇన్చార్జి హనుమంతరావు, మోడల్ మేకర్‌భాస్కరరావు, లక్ష్మానాయక్, ఆంజనేయులు, స్వయం సహాయకసంఘం మహిళలు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావుతో కలిసి పట్టణంలో పర్యటించారు. పట్టణం పరిశుభ్రంగా ఉండేం దుకు మున్సిపాలిటీ సిబ్బందితో పాటు ప్రజల సహకారం కీలక మని విజ్ఞప్తి చేశారు. ఇటీవల స్వచ్ఛసర్వేక్షన్ అవార్డుల్లో నరసరావుపేట మున్సిపాలిటీ స్టార్‌వన్ ర్యాంకు సాధించడం చరిత్రాత్మక సంఘటన అన్నారు. ఇది శానిటరీ సిబ్బంది సహ కారంతోనే సాధ్యమైందని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మున్సిపల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

రూ.1900 ప్రీమియంతో రూ.38 వేల పంట బీమా

సదస్సులో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి హరిప్రసాద్

ప్రజాశక్తి - యడ్లపాడు

పంటల సాగు చేసే రైతులు బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఏ.హరిప్రసాద్ అన్నారు. మండలంలోని సందెపూడి, తుర్లపాడులో పునర్వ్యవస్థీకరింప బడిన వాతావరణాధిత పంటల బీమా పథకం, ప్రధాన మంత్రి ఫసల్‌బీమా యోజన పథకాలపై బుధవారం నిర్వ హించిన పొలం పిలుస్తుంది కార్యక్రమం అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. మండలంలో పత్తి పంటను సాగు చేసే రైతులు ఎకరాకు రూ.1900 ప్రీమియం చెల్లించి బీమా చేసుకోవాలన్నారు. పంట నష్టం కలిగితే బీమా మొత్తం రూ.38వేలు పొందవచ్చు అన్నారు. వ్యవసాయ రుణం పొందిన రైతులు బ్యాంకు శాఖ ద్వారా ప్రీమియం చెల్లించవచ్చని, వ్యవసాయ రుణం పొందని రైతులు దగ్గరలోని కామన్ సర్వీస్ సెంటర్, మీ సేవ, రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి బీమా చేసుకోవాలన్నారు. కౌలు రైతులు కార్డులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏరువాక సెంటర్, శాస్త్రవేత్త ఎం.నగేష్ మాట్లాడుతూ భూములను ఖాళీగా ఉంచకుండా ప్రత్యామ్నాయ పంటలైన తక్కువ కాల వ్యవధి కలిగిన కంది, పెసలు, మినుములు మొక్కజొన్న పంటలను వేసుకొని దిగుబడులు పెంచుకోవచ్చని తెలియజేశారు. ప్రధాన పంటలు పత్తి, మొక్కజొన్న, కంది పంటలలో సస్యరక్షణ, జీవఎరువుల వాడకం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఏఈఓ జీవన్‌నాయక్, ప్రసన్నకుమార్, వ్యవసాయ సహాయకు రాలు విజయలక్ష్మి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

కుల, మతాలకతీతంగా సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పథకాల గురించి వివరిస్తున్న అరవింద బాబు, మోహన్ కృష్ణ

వైసిపి ప్రభుత్వం హయాంలో చేసిన పాపాలు పేరుకు పోయాయని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. మంగళవారం రాత్రి యలమంద పంచాయతీ గ్రామాలైన చీకటికాలనీ, శ్రీనివాస గిరిజన కాలనీలలో జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే అరవింద బాబు, రాష్ట్ర ఐటీ కార్పొరేషన్ చైర్మన్ మన్నవ మోహన్ కృష్ణతో కలిసి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో సూపర్ సిక్స్ హామీలతో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. నరసరావుపేటలోని తొమ్మిది సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో ప్రభుత్వ, స్వచ్ఛంద సహకారంతో మౌలిక వసతులు కల్పించామని అన్నారు. ఈ సంవత్సరం పదో తరగతి, ఇంటర్ మీడియట్ పరీక్షల్లో 90 శాతానికి పైగా విద్యార్థులు 93శాతం మార్కులతో అద్భుతమైన ఫలితాలు సాధించినట్లు తెలిపారు. ఐటీ కార్పొరేషన్ చైర్మన్ మన్నవ మోహన్ కృష్ణ రాష్ట్రవ్యాప్తంగా ఐటీ రంగంలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న డిఇఓ చంద్రకళ

సహిత విద్య ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణంలోని సమగ్ర శిక్ష పల్నాడు జిల్లా డిఇఓ కార్యాలయ ప్రాంగణంలో జిల్లాలో పని చేస్తున్న సహిత విద్య ఉపాధ్యాయులకు బుధవారం ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పల్నాడు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల వారీగా ఈనెల 18 నుండి 24 వరకు దివ్యాంగ విద్యార్థులకు మెడికల్ క్యాంప్ నిర్వహించడం కోసం తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారిణి ఎల్.చంద్రకళ, రమేష్‌బాబు, జిల్లా సహిత విద్య సమన్వయ కర్త సెల్వరాజు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా సహిత విద్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రంథాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని ప్రముఖ కవి ఎడారి కోయిల తెలగలపూడి ప్రసాదరావు ప్రసాదరావు జాషువాపై రచించిన "కవి తోద్యానపు వసంత కోయల జాషువా" గ్రంథాన్ని, అంబేద్కర్‌పై రచించిన "భారత రాజ్యాంగ రచనా భారవి" గ్రంథాలను గుంటూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, న్యూరోసర్జన్ నాగార్జునకొండ సుందరాచార్యులు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ జాషువాలాంటి మహోన్నత వ్యక్తి జన్మించిన వినుకొండగడ్డపై తెలగలపూడి ప్రసాదు పయనించడం గర్వకారణమన్నారు. చిలకల జాన్ సుందర్‌రావు, ఎర్రగుంట్లభాస్కర్, తెలగలపూడి బెంజిమెన్, పి. శ్రీనివాసరావు, జి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పిడుగురాళ్లలో మాట్లాడుతున్న సిడిపిఓ రాజేశ్వరి

వినుకొండలో ...

పలుచోట్ల తల్లిపాల వారోత్సవాలు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణంలోని పోలీస్‌స్టేషన్ రోడ్డులో పిడుగురాళ్ల సెక్టార్ 2లో ఉన్న అంగన్వాడి కేంద్రంలో బుధవారం తల్లి పాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పిడుగురాళ్ల సిడిపిఓ రాజేశ్వరి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ తల్లులు, గర్భిణులకు తల్లి పాల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. పిల్లలకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమని, పిల్లలకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సెక్టర్‌పరిధిలోని అంగన్వాడి నిర్వహకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు

తల్లిపాలు బిడ్డకు శ్రేష్టమని సిహెచ్ఓ అనుపమ అన్నారు. బుధవారం మండలంలోని లగడపాడు పెదకూరపాడులోని ఐదు, ఎనిమిది అంగన్వాడీ కేంద్రాలలోఅంగన్వాడీ కార్యకర్తలు ఆశాకార్య కర్తలు ఏఎన్‌ఎంలు తల్లుల ఇళ్లకు వెళ్లి తల్లిపాల విశిష్టత గురించి వివరించారు. పిల్లలకు పాలు ఇవ్వడం వల్ల జరిగే మేలు, తల్లులకు జరిగే మంచి వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్య కర్తలు పీవీ సామ్రాజ్యం, నాగ స్రవంతి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని కట్టకింద బజార్ సచివాలయ పరిధిలో అంగన్వాడి కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు జరుపుకున్నారు. సూపర్‌వైజర్ శేషకుమారి మాట్లాడుతూ బాలింతలకు చిన్నారులకు అందిస్తున్న పోషకాహారాన్ని సకాలంలో తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లిపాలు ఇవ్వాలని, పాలు గుడ్లు, బాలామృతం తప్పనిసరిగా చిన్నారులకు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు షేక్.రజియా. షేక్.నీలిమ, షేక్‌జాన్ బీ, వై.నీరజ, అంగన్వాడి సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఓరుగంటికి విశ్వజనని సేవారత్న అవార్డు

ప్రజాశక్తి - మాచర్ల

పత్రాన్ని అందుకుంటున్న చెన్నకేశవరావు

విశ్వజనని ఫౌండే షన్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా ప్రదానం చేయ బడుతున్న విశ్వ జనని సేవరత్న అవార్డుకు పల్నా డు జిల్లా మాచర్ల నుంచి సీనియర్ జర్నలిస్టు సామాజిక సేవా కార్యకర్త ఓరుగంటి చెన్నకేశవరావు ఎంపికయ్యారు. ఈ అవార్డును ఈనెల 20వ తేదీన హైదరాబాద్ నగరంలోని నాంపల్లిలోరి పొట్టి శ్రీరా ములు తెలుగు విశ్వ విద్యాలయంలో విశ్వజనని ఫౌండేషన్ 3వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమంలో అందించనున్నారు. జర్నలిస్టుగా, సామాజిక రంగాల్లో ఎన్నో సంవత్సరాలుగా అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు నిలుస్తుంది. ఓరుగంటి చెన్నకేశవరావు స్వం దిస్తూ 20 సంవత్సరాలుగా వివిధ తెలుగు దినపత్రికలలో రిపోర్టర్‌గా పనిచేస్తూ లయన్స్ క్లబ్, వాసవీక్లబ్, ఆవోపా, ఆర్య వైశ్య సంఘాల ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వ హిస్తూ, వివిధ దేవాలయాల్లో భక్తులకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవార్డు సేవారంగంలో నాకు మరింత బాధ్యతను పెంచుతుందన్నారు.

నిబద్ధత, క్రమశిక్షణతో ఏదైనా సాధ్యమే

సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ జి. కిరణ్ కుమార్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పూర్తి దృష్టి, నిబద్ధత, క్రమశిక్షణతో విద్యార్థులు దేనినైనా సాధ్యం చేయగలరని జపాన్‌కు చెందిన గిపు కంపెనీకు చెందిన సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ జి. కిరణ్ కుమార్ అన్నారు. స్థానిక ఎన్బిటి అండ్ ఎన్విసి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ (వైఎఫ్ ఎస్ఐ) ప్రోగ్రాంలో భాగంగా ఇన్నోవేషన్ అండ్ ఎంటర్ప్రె న్యూర్ షిప్ అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. సదస్సుకు ముఖ్య అతిథిగా డాక్టర్ జి.కిరణ్ కుమార్ హాజరై ప్రసంగించారు. విద్యార్థులు సమస్యను గుర్తించి పరిష్కార మార్గాన్ని వెతకాలని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఇంచార్జ్ డాక్టర్ కాకాని సుధాకర్, అధ్యాపకులు డాక్టర్ దీప, కల్పన, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు చేసుకోండి

ప్రజాశక్తి - కారంపూడి

మండలంలోని అన్నీ గ్రామాల రైతులు సాగు చేస్తున్న ప్రతి పంటను ఈ-పంటలో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి పోట్ల నరసింహారావు తెలిపారు. గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాలలోని వ్యవసాయ సహాయకులని సంప్రదించి వెంటనే ఈ-పంటలో నమోదు చేసుకోవాలని చెప్పారు. ఇప్పటి వరకు రైతులు పొలాల్లో సాగు చేస్తున్న ప్రత్తి, వరి, ఇతర పంటలన్నింటినీ వెంటనే క్రాప్ బుకింగ్ చేసుకోవాలి. ఈ-పంటలో నమోదు చేసుకుంటేనే రైతులకు పంటల బీమా వర్తిస్తుందని, పంటను అమ్ముకోవాలన్నా, పంటల నష్టం జరిగినప్పుడు పంట నష్ట పరిహారం అందాలన్నా, ప్రత్తి, వరిధాన్యం, కందులు పంటను అమ్ముకోవాలంటే రైతులు వేసిన పంటను ఈ-పంటలో నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు.

బృందావనాన్ని తలపిస్తోన్న శ్మశానవాటిక

నూతన హంగులతో రూపుదిద్దుకున్న శ్మశానవాటిక

- దాతల సహకారంతో సకల సదుపాయాలు
- ఆఖరి మజిలీల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహణ

ప్రజాశక్తి - తాడేపల్లి

ఎటువైపు చూసినా అందమైన పూల చెట్లు... కాళ్లకు మట్టి అంటకుండా తివాచీ పరిచినట్లు సిమెంటు రోడ్లు... అక్కడక్కడ విగ్రహాలు... సుమారు ఎకరం విస్తీర్ణంలో పరుచుకున్న పచ్చదనం. ఆ ప్రదేశాన్ని దూరంగా ఉండి చూస్తే ఇదేదో ఉద్యానవనం అనుకుంటారు. కానీ అది శ్మశాన వాటిక. బృందావనాన్ని తలపిస్తున్న ఈ శ్మశాన వాటిక రాజధానిలో భాగమైన పెనుమాకలో ఉంది. ఈ స్మశాన వాటికకు వెళ్లాలంటే ఇంతకు ముందు ముక్కు మూసుకుని వెళ్లాల్సి వచ్చేది. దుర్గంధ భరితమైన వాతావరణాన్ని తలపించేంది. దాతల సహకారంతో సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంది. సుమారు రూ. 50లక్షల వ్యయంతో శ్మశాన వాటికను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. జోరున వర్షం కురిసినా దహన సంస్కారాలు చేసుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. అంత్యక్రి యల్లో భాగంగా మృతుల బంధువులకు ప్రత్యేక స్నానాల గది, విశ్రాంతి గది, కర్మకాండల గది, స్త్రీలు, పురుషులకు వేరు వేరుగా మరుగు దొడ్లు, నిద్ర చేసేందుకు తదితర ఏర్పాటు చేశారు. ఆఖరి మజిలీల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఈశ్మశాన వాటికను నిర్వహిస్తున్నారు. దహన సంస్కారాలకు రూ.6వేలు, గుంత తీసి పూడ్చి నందుకు రూ.3వేలు, ఏసీ మార్చురీ బాక్సుకు రూ.1500/-లుగా నిర్ణయించి ఆ మేరకు బోర్డులు సైతం ఏర్పాటు చేశారు. దాతల సహకారంతో ఈ స్మశాన వాటికను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బ్రోచర్ పంపిణీ చేస్తున్న గాదె సుబ్బారెడ్డి

చిత్రలేఖనం పోటీలకు పిల్లలతో తరలిరండి

ప్రజాశక్తి- తాడేపల్లి

మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం, అమరావతి ఐకాన్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో బైపాస్ రోడ్ లోని అమరావతి ఐకాన్‌లో ఈనెల 10వ తేదీన జరిగే చిత్రలేఖనం పోటీలకు విద్యార్థినీ విద్యార్థులతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పెద్దలు తరలిరావాలని బాలోత్సవం ప్రతినిధులు కోరారు. బుధవారం పెనుమాక, కాజా, నూతక్కి, చిర్రా వూరు, రవీంద్ర పాడు గ్రామాల్లోని పాఠశాలలకు వెళ్లి బ్రోచర్లు పంపిణీ చేశారు. ఆయా పాఠశాలల నుండి స్పందన వ్యక్తం అయింది. ఈ కార్యక్రమంలో వై.సుబ్బారావు, జె.శేషయ్య, ముఖేష్, జి.సుబ్బారెడ్డి, ఎం.మనోహర్ రెడ్డి, డి.వి.భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న విద్యార్థిని

ఫార్మసీ దీనాపూర్ కళాశాలలో తల్లిపాల వారోత్సవాలు

ప్రజాశక్తి - ఫిరంగిపురం

మండల పరిధిలోని ఫార్మసీ దీనాపూర్ కళాశాలలో తల్లిపాల వారోత్సవాలు బుధవారం జరిగాయి. ఈ సందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఐసిడిఎస్, ఫార్మసీ దీనాపూర్ కళాశాలలో తల్లిపాల వారోత్సవాల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ప్రసూన, జిల్లా మిషన్ శక్తి నోడల్ ఆఫీసర్ శ్రీవాణి. సిడిపిఓ మరి అనురాధ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్, కళాశాల డైరెక్టర్ మేరీ, కార్యకర్తలు, కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు. డైరెక్టర్ ప్రసూన మాట్లాడుతూ "ప్రసవించిన గంటలోపు బిడ్డలకు ముర్రుపాలు పట్టించాలని సూచించారు. దీనివల్ల బిడ్డ ఎ, డి, ఇ, కె విటమిన్లు అందుతాయి" అని తెలిపారు. అనురాధ మాట్లాడుతూ "నేటి బాలికలే రేపటి తల్లులు. మీరు పోషకాహార లోపం లేకుండా, రక్తహీనతకు లోనుకాకుండా ఇప్పటి నుంచే ఆరోగ్యంగా ఉన్నట్లయితే, మీ బిడ్డ కూడా ఆరోగ్యంగా పుడతారని తెలిపారు. జిల్లా నోడల్ ఆఫీసర్ శ్రీవాణి మాట్లాడుతూ "ప్రస్తుత సమాజంలో ప్రతి ఆడపిల్ల ధైర్యంగా ఎదగాలి. మహిళలు, బాలికలు తమకు ఉన్న ప్రత్యేక చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన పెంచుకోవాలి అని తెలిపారు. అంతేకాక, "బాలికల కోసం 'సఖి', బాలుర కోసం 'యువ గ్రూప్' ఏర్పాటు చేయడం వల్ల వారు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే తెలియజేస్తారని అన్నారు.

అవయవదానంపై నిర్మల ఫార్మసీలో పోస్టర్ మేకింగ్ పోటీ

పోస్టర్ మేకింగ్‌లో పాల్గొన్న విద్యార్థినులు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీలోని జాతీయ సేవా పథకం లైఫ్ సేవర్స్ క్లబ్, ఫార్మాకాలజీ, ఫార్మసీ ప్రాక్టీస్ విభాగం సంయుక్తంగా అఖిల భారత శరీర అవయవ దాతల సంఘం సహకారంతో "అవయవ దాన ప్రాముఖ్యత" అనే అంశంపై బుధవారం పోస్టర్ మేకింగ్ పోటీ నిర్వహించారు. పోటీలో మంగళగిరి పరిసరాల్లోని విజె డిగ్రీ కాలేజ్, నిర్మల జూనియర్ కాలేజ్, ఎస్ ఎల్ ఎం చైతన్య స్కూల్, సికె జూనియర్ కాలేజ్, నిర్మల సిబిఎస్ఈ హై స్కూల్ విద్యార్థులు మొత్తం 210 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు తాము తయారుచేసిన పోస్టర్ల ద్వారా అవయవ దానానికి సంబంధించిన గొప్ప సందేశాలను చక్కగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని ఎఐబిఒడిఏ అధ్యక్షురాలు గూడూరు సీతామహాలక్ష్మి ప్రేరణతో నిర్వహించగా, అధ్యక్షులు డాక్టర్ రమణ యశస్వి గుంటూరు జిల్లా అధ్యక్షుడు ముక్కల కిరణ్ బాబు జాయింట్ సెక్రటరీ ఉమా రాజశేఖర్, సెక్రటరీ నర్మద కొండవీటిలు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల ప్రతిభను సెక్రటరీ మరియు కరస్పాండెంట్ రెవ. సిస్టర్ జి.నిర్మలజ్యోతి, ప్రిన్సిపాల్ డాక్టర్ బి. పాములరెడ్డి ప్రశంసించారు. కార్యక్రమంలో జి. దీపిక, దివ్య అంజని, కె. ప్రణీత్, జి.సుస్మిత, జి.ప్రజ్ఞ, కె.హర్షవర్ధన్, కె.చంద్రశేఖర్, జి.కీర్తి శ్రీ, ఎన్.ఆశసాయి పాల్గొన్నారు.

ప్రతిఊరూ స్వచ్ఛ గ్రామం అవ్వాలి : జడ్‌పి సిఈవో జ్యోతిబసు

సర్పంచ్ నాగమల్లేశ్వరిని సన్మానిస్తున్న డిపిఓ, జడ్‌పి సిఈఓ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రతి గ్రామం స్వచ్ఛ గ్రామం అవ్వాలి అని జడ్‌పి సిఈఓ జ్యోతి బసు అన్నారు. బుధవారం ప్రత్తిపాడు నియోజక వర్గ కేంద్రంలోని తుమ్మల పాలెం (సుప్రీమ్ ఎల్టీసీ) గ్రామ పంచాయతీ లోని స్వచ్ఛ సంపద కేంద్రం వద్ద గుంటూరు జిల్లా లోని 17 మండలాల ఎంపీడీఓ లు మరియు డిప్యూటీ ఎంపీడీఓ లకు హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ గ్రామ సర్పంచ్ చల్ల నాగ మల్లేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు.ముందుగా తుమ్మల పాలెం గ్రామం లో ఎంపీడీఓ లు డిప్యూటీ ఎంపీడీఓ లు ఆరు టీమ్ లుగా ఏర్పడి తడి పొడి చెత్త సేకరణ ఏ విధంగా జరుగుతుందో పరిశీలించారు. జడ్‌పిసిఈ ఓ జ్యోతిబసు మాట్లాడుతూ ప్రతి గ్రామం స్వచ్ఛ గ్రామం కావాలి అని దానికోసం ప్రతి అధికారి పర్యవేక్షణ చేయాలని సూచించారు. డి.పి.ఓ. నాగ సాయి కుమార్, డిఎల్‌పిఓ శ్రీనివాసరావు మాట్లాడారు. అనంతరం గ్రామం సర్పంచ్ చల్ల నాగ మల్లేశ్వరిని క్లాప్ మిత్రులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాజావలి, డిపిఆర్‌సి నిరంజన్, కరిముద్దీన్,అనురాధ,ఐ.టి.సి సొసైటీ కో ఆర్డినేటర్ యశ్వంత్, శ్రీనివాసరావు, ఉమామహేశ్వరి, క్లాప్ మిత్రులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం

తల్లిపాల ప్రాముఖ్యతను విస్తరిస్తున్న పి.హెచ్.సి. డాక్టర్ సుబ్బారావు, పెనుమాకలో తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న సిబ్బంది

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తల్లిపాలు అమృతంతో సమానమని, అప్పుడే పుట్టిన బిడ్డలకు తల్లిపాలు పట్టించడంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ సి.హెచ్. వెంకటసుబ్బార్నా అన్నారు. కొలకలూరు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కొలకలూరు సెక్టార్ సూపర్ వైజర్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పి.హెచ్.సి వైద్యులు డాక్టర్ సిహెచ్ వెంకట సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. తల్లిపాలు అఈ కార్యక్రమంలో పిహెచ్‌ఎన్ లక్ష్మీప్రసన్న, ఎఎన్ఎం పద్మాభాయ్, తల్లులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- తాడేపల్లి

పెనుమాక అంగన్‌వాడీ సెంటర్ 6లో తల్లిపాల వారోత్సవ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ పెనుమాక సెక్టర్ సూపర్‌వైజర్ సిహెచ్. శిరోమణి, హెల్త్ అసిస్టెంట్ మాట్లాడుతూ పిల్లలకు తల్లి పాలు ఇవ్వటం వలన ఎంతో ప్రయోజనం అని చెప్పారు. బిడ్డ ఎదుగుదలకు పౌష్టికాహారం అందే విధంగా రోగ నిరోధక శక్తి పెరగడానికి తల్లికి కూడా ఆరోగ్యకరమైన విషయమని వివరించారు. అందువలన తల్లి బిడ్డలకు పాలు ఇవ్వటం చాలా ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

డీలర్లతో మాట్లాడుతున్న ఏడీఏ మోహన్‌రావు

ఎరువుల డీలర్లు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ఎరువుల డీలర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించాని ఎడిఏ ఎన్.మోహన్ రావు అన్నారు. ప్రత్తిపాడు నియోజక వర్గ కేంద్రంలో వ్యవసాయ అగ్రిల్యాబ్‌లో ప్రత్తిపాడు వ్యవసాయ అధికారి సుగుణ బేగం అధ్యక్షతన బుధవారం డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్ రావు మాట్లాడుతూ డీలర్లు అందరూ ఎరువులకు సంబంధించి అన్ని స్టాప్ రిపోర్టర్లు గ్రౌండ్ బ్యాలెన్స్ టలీ అవాలని అన్నారు. ప్రతి దుకాణం వద్ద కచ్చితంగా ధరల పట్టి ప్రదర్శించాలి. ప్రదర్శించిన ఏం ఆర్ పి ధరకే ఉత్పత్తులు విక్రయించాలని అన్నారు. విక్రయం చేసిన ఉత్పత్తులకు రసీదు కచ్చితంగా ఇవాలని తెలిపారు. ఎరువులు, పురుగు మందులకు దూరంగా విత్తనాల స్టాక్ నిల్వలు ఉండేలా చూసుకోవాలని అన్నారు.

పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

ఎరువుల కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

ప్రజాశక్తి - చేబ్రోలు

ఎరువుల కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయాధికారి పి.ప్రియదర్శిని అన్నారు. చేబ్రోలు, వడ్లమూడి గ్రామాల్లో బుధవారం పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తవ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ మరియు అనుబంధ శాఖల అధికారులతో కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో పొన్నూరు ఎడిఎ రామకోటేశ్వరి మాట్లాడుతూ రైతులు ఆందోళన చెందకుండా ఉండేలా రైతు సేవ కేంద్రాలలో ఎరువులు నిల్వ ఉంచేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ , క్రింద అర్హత ఉన్నవారు నమోదు చేసుకోవాలని, ఇందుకు సిబ్బంది ప్రచారం చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు ఏవో రాజేశ్వరి, శాస్త్రవేత్తలు డయానా , పుష్ప రేఖ , చేబ్రోలు ఏవో పి.ప్రియదర్శిని ,గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు..

వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉచితంగా కృత్రిమ చేతుల పంపిణీ

ప్రజాశక్తి మంగళగిరి

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జర్మనీలో తయారు చేసిన జి.ఈ.ఎం.ఎం.కె-1 కృత్రిమ చేతులను ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమ ప్రచారంలో భాగంగా బుధవారం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. స్థానిక గణపతి నగర్‌లోని వి.జె. డిగ్రీ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రోటరీ డిస్ట్రిక్ట్ 3150 గవర్నర్ డాక్టర్ ఎస్.వి. రామ్ ప్రసాద్ పాల్గొన్నారు. మంగళగిరి పి.డి.జి అన్నే రత్న ప్రభాకర్ విశిష్ట అతిథిగా పాల్గన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో భారత్‌లో మొట్టమొదటిసారిగా జర్మనీ నుంచి దిగుమతి చేసిన ఈ కృత్రిమ చేతులు మంగళగిరి రోటరీ క్లబ్ ద్వారా దివ్యాంగులకు అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పుడు మరలా ఈ అవకాశాన్ని కల్పించడంతో అనేక మంది దివ్యాంగుల జీవితాల్లో మార్పు వస్తుందని వారు తెలిపారు. ఈ సందర్భంగా రోటరీ సభ్యులు, రోటరాక్టర్లు, విద్యార్థులు కలిసి వి.జె. కళాశాల నుండి శాంతి ర్యాలీ నిర్వహించారు.

అంగన్‌వాడీ సహాయకుల ఖాళీల భర్తీకి

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు అర్బన్ పరిధిలోని అంగన్‌వాడీ సహాయకుల ఖాళీల భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సిడిపిఒ బి.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని అంకిరెడ్డిపాలెం ఎస్సీ, స్వర్ణభారతి నగర్ 4, భాగ్యనగర్ 3, బోసుబొమ్మ 2, శ్యామలానగర్, శ్రీకృష్ణ దేవరాయనగర్ 2, గుంటూరు తూర్పు నియోజక వర్గంలోని వీవర్స్ కాలనీ, గోరంట్ల పెదబావి, ఆనందపేట 3, లక్ష్మీ నరసింహాపురం, ఎల్‌బి నగర్ 1, వసంతరాయపురం, శారదాకాలనీ 2 అంగన్‌వాడీ కేంద్రాలలో సహాయకుల పోస్టులను భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసే వారు 2025 జులై 1 నాటికి 21 సంవత్సరాలు నిండి, 35 సంవత్సరాల లోపు ఉండాలని, స్థానికులు అయ్యి, 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన కేంద్రాలకు ఆయా సామాజిక తరగతికి చెందిన వారే దరఖాస్తు చేసుకోవాలన్నారు. పుట్టిన తేదీ, విద్యార్హత, కులధృవీకరణ, నివాస ధృవీకరణ, విడో అయితే భర్త మరణ ధృవపత్రం, విడో అయ్యి 18 సంవత్సరాల లోపు పిల్లలు ఉంటే పిల్లల వయస్సు ధృవీకరణ పత్రం, అనాధలు అయితే అనాధ సర్టిఫికెట్, వికలాంగులు అయితే పిహెచ్ సర్టిఫికెట్ నకళ్లు గజిట్ అధికారితో అటెస్ట్ చేయించి, దరఖాస్తు ఫారంతో జతచేసి, ఆగస్టు 14వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా ఏటి అగ్రహారం, హనుమాన్ నగర్ 6వ లైను, శ్రీలక్ష్మి నిలయంలోని సిడిపిఒ కార్యాలయంలో అందచేయాలని కోరారు.

అక్రమ నిర్మాణాలను ఉపేక్షించబోము

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలో భవన నిర్మాణ అనుమతులు లేకుండా, ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మించే ఎటువంటి కట్టడాలను అయినా పూర్తి స్థాయిలో కూల్చివేస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో గత 3 రోజుల నుండి పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో పలు ప్రాంతాలలో అక్రమ కట్టడాలను గుర్తించి తొలగించుట జరుగుతుందన్నారు. అటువంటి భవన యజమానులకు నోటీసులు జారీ చేశామని, సదరు నిర్మాణాలను కూల్చివేయడానికి పట్టణ ప్రణాళిక అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్డులోని భవానినగర్, శ్రీరామ నగర్ 7వ లైన్, బొంగరాల బీడు, అరండల్ పేట ప్రాంతాలలో అక్రమ కట్టడాలను కూల్చామన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో గుర్తించి తుది నోటీసులు అందించిన 25 అనధికార భవనాలను గురువారం కూల్చివేత చేపట్టాలన్నారు. శుక్రవారం నుండి అనధికార లే అవుట్స్ తొలగించాలన్నారు. అనధికార హోర్డింగ్స్ ని ఉపేక్షించ వద్దని, ఫీజులు చెల్లించని ఏ బోర్డు నైనా తొలగించాలన్నారు. నిర్మాణాలు ప్రారంభ దశలోనే గుర్తించి, అనధికార నిర్మాణాలు జరగకకుండా నియంత్రిం చాలన్నారు.

జిఎంసికి సర్వీసు ఛార్జీల బకాయిలు చెల్లించాలి..

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన సర్వీస్ చార్జీల బకాయిలు చెల్లించాలని, బకాయి నోటీసులు ఇప్పటికే అందించామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. బుధవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో వివిధ కేంద్రప్రభుత్వ కార్యాలయాల అధికారులతో సర్వీస్ చార్జీల వసూళ్లపై అదనపు కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ రైల్వే, పోస్టల్, సెంట్రల్ ఎక్సైజ్, ఇన్‌కంట్యాక్స్, మిలటరీ, నెహ్రూ యువ కేంద్రం, స్పైసెస్ బోర్డ్, సిటిఆర్‌ఐ స్టేషన్ వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలు 141 అసెస్మెంట్ల ద్వారా షుమారు రూ.36 కోట్లు సర్వీస్ చార్జీలు బకాయిలు ఉన్నాయని తెలిపారు. బకాయిల చెల్లింపు కోసం జిఎంసి రెవెన్యూ అధికారులను డిపార్ట్మెంట్ల వారీగా షెడ్యూల్ కేటాయించాలని అదనపు కమిషనర్ తెలిపారు. ఆయా సంస్థలకు ఇప్పటికే డిమాండ్ నోటీసులు ఇచ్చామని, అందులో ఏమైనా సందేహాలు ఉంటే రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు.

విద్యాశక్తి కార్యక్రమాన్ని నిర్బంధం చేయడం తగదు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాశక్తి కార్యక్రమం ఐచ్ఛికంగా నిర్వహించాలని పాఠశాలవిద్య శాఖ డైరెక్టర్ తెలియజేశారని, కానీ మన జిల్లాలో కొన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్బంధంగా నిర్వహిస్తున్నారు, ఈ చర్యలను వ్యతిరేకిస్తున్నామని ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ కె.నరసింహారావు తెలియజేశారు. ఈ మేరకు డిఇఒ సి.వి.రేణుకకు వినతిపత్రం అందచేశారు. సాధారణంగా విద్యార్థులు సాయంత్రం నాలుగు గంటలకు అలసిపోతారని, ఆ సమయంలో విద్యాశక్తి పేరుతో అదనంగా తరగతులు నిర్వహించడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదన్నారు. కావున విద్యాశక్తి కార్యక్రమాలు గురించి ఎవర్ని నిర్బంధం చేయవద్దని ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. దీనిపై డిఇఒ స్పందిస్తూ విద్యాశక్తి కార్యక్రమం నిర్బందం కాదని, ఐచ్ఛికం మాత్రమేనని చెప్పారు. కార్యక్రమంలో ఫ్యాప్టో డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ యు .రాజశేఖర్‌రావు, డి.కె.సుబ్బారెడ్డి, ఎం.డి.ఖలీద్, జిల్లా కార్యవర్గ సభ్యులు తిరుమలేష్, కళాధర్,పెదబాబు, బాలాజీ, వై.శ్యాం మొదలగువారు పాల్గొన్నారు.

డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న ఫ్యాప్టో నాయకులు

మిర్చి గోడౌన్లలో బాలకార్మికుల గుర్తింపు

ప్రజాశక్తి-గుంటూరు

మిర్చియార్డ్ పరిసరాల్లో మిర్చి తొడాలు తీసే గోడౌన్లలో కార్మిక శాఖ అధికారులతో కలిసి నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం పరిశీలించారు. బాల కార్మికులను గుర్తించి, వారిని స్కూల్స్‌ల్లో చేర్చడం, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేయడంపై తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆకస్మిక తనిఖీలలో 14 మంది బాలా కార్మికులను గుర్తించారు. మరి కొందరు తమను చూసి వెళ్లారని కమిషనర్ తెలిపారు. ఆయా బాల కార్మికులను స్కూల్స్‌ల్లో చేర్చడం, వారి తల్లిదండ్రులకు తగిన కౌన్సిలింగ్ అందించాలని కార్మికశాఖ అధికారులను ఆదేశించా మన్నారు.

అనధికార కట్టడాలు స్వచ్ఛందంగా తొలగించుకోవాలి.

కమిషనర్ బుధవారం శారదా కాలనీ, సంజీవయ్య నగర్, కెవిపి కాలనీ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అనధికార కట్టడాలు, లేఅవుట్స్, హోర్డింగ్స్, ట్యాప్‌లు 48 గంటల్లోగా స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేకుంటే జిఎంసి సిబ్బందే తొలగించి, అందుకు అయిన ఖర్చుతోపాటు అపరాధరుసుం కూడా విధించటం జరుగుతుందని స్పష్టం చేశారు. చాలా ప్రాంతాల్లో అనధికార మున్సిపల్ కుళాయిలు ఉన్నాయని తమ దృష్టికి వచ్చిందని, సదరు కుళాయిలను తొలగించుకోవాలన్నారు. నగరపాలక సంస్థకు ఆస్తి, ఖాళీ స్థల పన్నుబకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. పర్యటనలో జాయింట్ లేబర్ కమిషనర్ ఎం.బాలునాయక్, డిప్యూటీ కమిషనర్ ఏ.గాయత్రి దేవి, జిఎంసి ఏసిపి వెంకటేశ్వరరావు, డిఈఈ వెంకటరమణ, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

మిర్చిగోడౌన్లలో గుర్తించిన బాల కార్మికులతో కమిషనర్, కార్మికశాఖ అధికారులు

మొబైల్‌కు బానిసలుగా మారొద్దు

ఎపిఎస్‌పి బెటాలియన్, మంగళగిరి ఐజీ బి.రాజకుమారి

ప్రజాశక్తి-గుంటూరు

మలినేని లక్ష్మయ్య మహిళల ఇంజినీరింగ్ కళాశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇండక్షన్ ప్రోగ్రామ్ కళాశాల ఆడిటోరియంలో వేడుకగా నిర్వహిం చారు. కార్యక్రమంలో ఎపిఎస్‌పి బెటాలియన్, మంగళగిరి ఐజీ బి.రాజకుమారి మాట్లాడుతూ తాను బాల్యంలో ఒక సాధారణ కుటుం బంలో పుట్టి, క్రమశిక్షణ, నిబద్ధత, లక్ష్యసాధన ద్వారా ఐపీఎస్ ఆఫీసర్‌గా ఎదిగిన విషయాలను విద్యార్థులతో పంచుకున్నారు. నేటి యువత అధికంగా మొబైల్‌ఫోన్లు, సోషల్ మీడియాపై ఆసక్తి చూపుతూ సమయాన్ని వృథా చేస్తున్నారని, దీనివల్ల విద్యపై దృష్టి తప్పిపోతుందనే చెప్పారు. 'సాంకేతిక పరిజ్ఞానం మంచిదే అని, దానికి బానిసలుగా మారకూడదన్నారు. మలినేని గ్రూప్ ఆఫ్ కాలేజెస్ ఛైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్ల మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు నైపుణ్యాలు, విలువలు, పరిశోధనా అభిరుచి, ఆచరణాత్మక జ్ఞానం పొందే అవకాశాలు విస్తతంగా ఉంటాయన్నారు. ప్రాజెక్టులు, స్టార్టప్‌లు, హ్యాకథాన్‌లు, ఎంఎస్‌ఎంఇ ప్రాజెక్టులు, ఇన్నోవేషన్ ప్రయోగాలు మొదలైన వాటిలో మా కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో విజయాలు సాధించారన్నారు. పిల్లలను కళాశాలకు పంపించట మేకాకుండా వారిని గమనిస్తూ, ప్రోత్సహిస్తూ ఉండాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జె.అప్పారావు, డీన్‌లు డాక్టర్ పోపూరి రమేష్‌బాబు, జంపని కిషోర్‌బాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాజకుమారి

అద్భుతాల సృష్టికర్తలు ఇంజినీరింగ్ విద్యార్థులు

ఎంబిటిఎస్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ తాళ్లూరి శేఖర్

ప్రజాశక్తి-గుంటూరు

అద్భుతాల సృష్టికర్తలు ఇంజినీరింగ్ విద్యార్థులు అని, సాంకేతిక యుగంలో నెలకొన్న పోటీ ప్రపంచంలో రాణించాలంటే ప్రాథమిక దశ నుండే సాంకేతిక పరిజ్ఞానంతోపాటు, నైతిక విలువలు, కమ్యూనికేషన్ స్కిల్స్, టీం వర్క్ అభివృద్ధి చేసుకోవాలని గుంటూరు ఎంబిటిఎస్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ తాళ్లూరి శేఖర్ అన్నారు. ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిలో బుధవారం జరిగిన ఏఐసిటిఈ ఇండక్షన్ ప్రోగ్రాంకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని బి.టెక్ ఇంజినీరింగ్ కోర్స్ మొదటి సంవత్సరంలో ప్రవేశించిన విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్య సాధన చేరువ దిశగా, ప్రారంభంలోనే తగిన ప్రణాళికను రూపొందించుకోవాలని, నిత్యం సాంకేతిక రంగం వేగం పుంజుకుంటున్నదని, సమయాన్ని వధా చేయకుండా విద్య పైనే శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలు మెచ్చే భావి భారత నిర్మాణానికి విద్యార్థులు నూతన నాంది పలకాలని కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె. మద్దినేని పేర్కొన్నారు. విద్యతో పాటూ విద్యార్థులు శారీరక మానసిక శక్తిని పెంచుకునేందుకు క్రీడలకు కూడా ప్రాధాన్యతను ఇవ్వాలని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాల కష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తాళ్లూరి శేఖర్

నేడు ఎం.ఎస్.స్వామినాథన్ శత జయంతి సభ

ప్రజాశక్తి - విజయవాడ

హరిత విప్లవకారుడు, జాతీయ రైతు కమిషన్ చైర్మన్ ఎం.ఎస్.స్వామినాథన్ శత జయంతి సభ ఈనెల 7వ తేదీ ఉదయం 10 గంటలకు విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో జరుగుతుందని ఎపి రైతు సంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, ఎపి కౌలు రైతుల సంఘం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపాయి. ఈ సభలో రాష్ట్ర వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్, ఆచార్య రంగా యూనివర్సిటీ స్పెషల్ సైంటిస్ట్ ప్రసాద్, విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త ఎన్.వేణుగోపాలరావు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్, కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు తదితరులు పాల్గొంటారని తెలిపాయి.

పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజారోగ్య కార్మికుల కష్ట ఫలితమే జాతీయ స్థాయిలో స్వచ్ఛ సూపర్ లీగ్ నగరాల్లో గుంటూరు నగరం నిలిచిందని, కార్మికులకు జిఎంసి అండగా ఉంటుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. బుధవారం చుట్టగుంట పోలేరమ్మ దేవాలయం కళ్యాణ మండపంలో ఐటిసి ఎంఎస్కే, ఫినిష్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రజారోగ్య కార్మికులకు ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు నిద్ర లేవక ముందు నుండే ప్రజారోగ్య కార్మికులు విధుల్లో ఉండే ప్రజారోగ్య కార్మికుల సంక్షేమానికి నగంపాలక సంస్థ అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఇన్సూరెన్స్ అమలు చేస్తున్నామని, త్వరలో రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రమాదంలో మరణించే కార్మికుల కుటుంబాలకు రూ.20 లక్షలు అందేలా ప్రత్యేక ఇన్సూరెన్స్ స్కీం అమలు చేయబోతుందన్నారు. కార్మికులు తమకు క్షేత్ర స్థాయిలో ఏ సమస్య ఉన్నా తమ దష్టికి తీసుకురావాలన్నారు. వార్డుల వారీగా ప్రతినెల ఒక కార్మికునికి వెయ్యి రూపాయల ప్రోత్సాహక పారితోషికం అందిస్తామని తెలిపారు. కార్మికులు తప్పనిసరిగా యాప్రాన్‌తో విధులకు హాజరు కావాలని, ప్రజల నుండి తడిపొడిగా వ్యర్థాలు వేరుగా సేకరణ చేయాలన్నారు. కార్మికులకు వార్డుల వారీగా ఉచిత వైద్యపరీక్షలు, మెడిసిన్స్ అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఐటిసి ఎంఎస్కే, ఫినిష్ సొసైటీ మేనేజర్ కే.నారాయణ, డాక్టర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్ రాము, కార్మికులు పాల్గొన్నారు.

సుమన్ తో మందడం గ్రామస్తులు

రాజధానిలో సినీ హీరో సుమన్ సందడి

ప్రజాశక్తి - తుళ్లూరు

సినీ హీరో సుమన్ బుధవారం రాజధానిలో సందడి చేశారు. మందడంలో నర్రా నారాయణకు చెందిన కార్యాలయ ప్రారంభోత్సవానికి హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం తమిళనాడు రాజకీయాల్లోకి ఆహ్వానిస్తున్నారని, నేను పుట్టింది, పెరిగింది తమిళనాడులోనే.. మనం అందరం కూటమి ప్రభుత్వానికి సపోర్ట్ చేయాలన్నారు. అందరూ రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. సుమన్‌ను చూసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు గుమిగూడారు. స్థానికులు సుమన్‌కు పుష్పగుచ్ఛాలు అందజేశారు.